# శుభోదయం

WWW.SUBHODAYAMDAILY.COM

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

అమరావతి/హైదరాబాద్ , సంపుటి : 01, సంచిక : 196, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) గురువారం - 26 - సెప్టెంబర్ - 2024


## ఇజ్రాయెల్ భీకర దాడుల్లో 356 మంది మృతి

1000 మంది పైగా తీవ్ర గాయాలపాలు

హిజ్బుల్లా అడ్డాలే లక్ష్యంగా దూకుడు

300కు పైగా లక్ష్యాలపై రాకెట్ల వర్షం

వేలాది వాహనాల్లో తరలిపోయిన ప్రజలు

మరో గాజాలా లెబనాన్




## ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీతో సమావేశమైన ప్రధాని మోదీ

రష్యా, ఉక్రెయిన్ మధ్య వివాదం..

నెల రోజుల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య ఇది రెండో సమావేశం




## దేశంలో తొలి క్లేడ్ 1బీ మంకీపాక్స్ కేసు

ప్రాణాంతక మంకీపాక్స్‌కు సంబంధించి భారత్‌లో మరో కేసు

కేరళలోని మలప్పురం జిల్లాలో ఓ వ్యక్తికి ఈ వ్యాధి నిర్ధారణ

విదేశాల నుంచి తిరిగి వచ్చే వారిలో వ్యాధి లక్షణాలు కనపడితే ఆరోగ్యశాఖకు తెలియజేయాలి




## దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా

# ఏపీ అభివృద్ధికి రూట్ మ్యాప్

- చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు
- దేశంలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దుతామన్న లోకేశ్
- 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపు
- విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్, అంతర్జాతీయ స్థాయి డేటా సెంటర్



అమరావతి: 2047 నాటికి దేశంలో నెం.1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలు, ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన సదస్సుకు జాతీయస్థాయి ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... రాష్టంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వ చర్యల కారణంగా అయిదేళ్లుగా స్పీడ్ బ్రేకర్లు పడ్డాయని, అన్నివిధాలా నిర్లక్ష్యానికి గురైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు.

అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రత్యేక దృష్టి

చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ఒక రంగంపై దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కర్నూలు జిల్లాలో రెన్యువబుల్ ఎనర్జీ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని, రాబోయే ఐదేళ్లలో 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా హైడ్రో, విండ్, సోలార్ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున అక్కడకు వస్తాయని ఆకాంక్షించారు. అనంతపురం జిల్లాలో ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, చిత్తూరు, కడప జిల్లాల్లో ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీస్, ప్రకాశం జిల్లాలో బయోఫ్యూయల్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో క్యాపిటల్ రీజియన్, గోదావరి జిల్లాల్లో ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలను అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు గత అయిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గోదావరి జిల్లాల్లో గ్రీన్ ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలోనే అతిపెద్ద పెట్రో కెమికల్ కారిడార్ అక్కడ రాబోతుందన్నారు.

విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయి డేటా సెంటర్

విశాఖపట్నాన్ని ప్రపంచంలోనే నెం. 1 ఐటీ హబ్‌గా తయారు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ స్థాయి డేటా సెంటర్ అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ఉత్తరాంధ్రను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభయ్యాక విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎయిర్ కనెక్టివిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అయితే కేవలం పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉంటే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినట్లు కాదని, ఆయా రంగాల్లో సాధించిన అభివృద్ధి ద్వారా వచ్చిన

మిగతా..2లో

## సమిష్టి శక్తిలోనే మానవాళి విజయం



## ఐరాస సదస్సులో మోదీ

ఐరాస: మానవాళి విజయం సమష్టి శక్తిలోనే దాగుంది తప్ప యుద్ధక్షేత్రంలో కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యుద్ధం ఎన్నటికీ సమస్యల పరిష్కార వేదిక కాబోదని కుండబద్దలు కొట్టారు. సోమవారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి 79వ సర్వసభ్య సమావేశంలో భాగంగా 'ప్రపంచ భవితపై శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని ప్రసంగించారు. ఉక్రెయిన్, గాజా యుద్ధాలు, దేశాల నడుమ ఉద్రిక్తతలు, గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పుల వంటి పెను సమస్యల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రపంచ శాంతికి, ప్రగతికి ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. "మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టే ఏ చర్యలకైనా మనిషి సంక్షేమమే అంతిమ లక్ష్యం కావాలి. అప్పుడే అవి ఫలిస్తాయి" అని మోదీ సూచించారు. "నమస్కారం. ప్రపంచ మానవాళిలో ఆరో వంతుకు సమానమైన 140 కోట్ల మంది భారతీయుల తరఫున వారి గళాన్ని విన్పిస్తున్నా"

మిగతా..2లో

## 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా నిరుద్యోగ సమస్య పోదు




రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రతి సంవత్సరం 3 లక్షల మంది పట్టాలు తీసుకొని బయటకు వస్తున్నారన్న సీఎం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడినట్లు వెల్లడి

బ్యాంకులు, బీమా రంగాల్లో చాలా ఉద్యోగాలు ఉన్నాయని వెల్లడి

## మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అసలు

# ఉద్దేశం వేరే ఉంది..

- మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం..
- పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు..
- పాకిస్తాన్ కంపెనీలకు మూసీ సుందీకరణ



హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరాన్ని ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దాలనే దృఢ కసంకల్పంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే 20 కోట్ల లీటర్ల మురికి నీటిని సంపూర్ణంగా శుద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ. 4 వేల కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఫతేనగర్ ఎస్టీపీని సందర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇండియాలోనే 100 శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే ఏకైక నగరంగా హైదరాబాద్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం తీసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవాళ కూకట్‌పల్లి ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇది ప్రస్తుతం ట్రయల్ రన్ దశలో ఉంది. ఎస్టీపీల సందర్శనలో ఇది మొదటి అడుగు మాత్రమే.. ఉప్పల్ నల్ల చెరువు, ఎల్‌బీనగర్, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీలను కూడా త్వరలోనే సందర్శిస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

మిగతా..2లో

## పిల్లల కోసం నీళ్లు అడిగితే ఇవ్వలేని పరిస్థితి చూశా..




- వరదలపై సీఎం చంద్రబాబు ప్రెస్ మీట్
- తన జీవితంలో అలాంటి విపత్తును ఎన్నడూ చూడలేదన్న చంద్రబాబు
- ఓ పక్క క్లౌడ్ బరస్ట్.. మరోవైపు బుడమేరు వరద
- విపత్తులను హ్యాండిల్ చేయడంలో కొత్త ఒరవడి

# ఎప్పుడూ మన్ కీ బాత్ ముచ్చట్లే

- 'కామ్ కీ బాత్' ఏనాడూ చెప్పలేదు
- కశ్మీర్‌ను ఢిల్లీ సర్కార్ కాదు, స్థానికులే పాలించాలి
- కుల గణన అనడానికే మోదీ జంకుతున్నారు
- వాళ్లు చేయకుంటే మేమే చేస్తాం
- బాధ్యతలను విస్మరించారంటూ ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు



సురాన్‌కోట్(జమ్మూకశ్మీర్)/శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న నిరుద్యోగ సమస్య, ధరల కట్టడిని మోదీ నిర్లక్ష్యం చేశారని ఎండగట్టారు. సోమవారం పూంఛ్ జిల్లాలోని సురాన్‌కోట్ శాసనసభ నియోజకవర్గంలో, శ్రీనగర్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. "నెలకోసారి 'మన్ కీ బాత్'ముచ్చట్లతో మోదీ మోతెక్కిస్తారు. కానీ ఏనాడూ

మిగతా..2లో

## వాతావరణ శాఖ అలర్ట్.. ఈ 13 రాష్ట్రాల్లో 27 వరకు భారీ వర్షాలు



అమరావతి: కొన్ని చోట్ల ఉపశమనం కలిగించి, మరికొన్ని చోట్ల ఇబ్బంది కలిగించిన తర్వాత ఇప్పుడు రుతుపవనాలు నిష్క్రమించే సమయం వచ్చింది. గుజరాత్ నుంచి రుతుపవనాలు వెనక్కి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ కూడా సెప్టెంబర్ 23 నాటికి పశ్చిమ రాజస్థాన్, కచ్ నుండి నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని సూచించింది. అయితే విశేషమేమిటంటే దాదాపు 10 రోజుల ఆలస్యంతో

మిగతా..2లో

## పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ

# ముమ్మాటికీ నేరమే

సుప్రీంకోర్టు కీలక తీర్పు

వీడియోలు డౌన్‌లోడ్, స్టోర్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరపూరిత చర్యలే

దేశ అత్యున్నత ధర్మాసనం కీలక తీర్పు

పిల్లల అశ్లీల చిత్రాలు చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత

హైకోర్టు తీర్పు ఘోర తప్పిదమని వ్యాఖ్య




హైదరాబాద్, : పిల్లల అశ్లీలత, వారిపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను చూడటం ముమ్మాటికీ నేరమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటంతో పాటు ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, స్టోర్ చేసుకోవడం కూడా పోక్సో చట్టం ప్రకారం నేరం కిందకే వస్తుందని పేర్కొంది.

# ఇజ్రాయెల్ భీకర దాడుల్లో 356 మంది మృతి

బీరుట్, టెల్ అవీవ్: లెబనాన్ సోమవారం బాంబుల మోతతో దద్దరిల్లింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని 17 పట్టణాలు, పల్లెలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు తలదాచుకున్నవిగా, ఆయుధాలను భద్రపరిచినవిగా భావిస్తున్న నిర్మాణాలపైన రాకెట్ల వర్షం కురిపించింది. అంతకుముందు ఆ ప్రాంతాల్ని వీడి వెళ్లాలని స్థానికులకు హెచ్చరిస్తూ వేలాది ఫోన్ కాల్స్ చేసింది. 11 నెలలుగా ఓవైపు హమాస్‌తో యుద్ధం చేస్తూనే మరోవైపు హిజ్బుల్లాతోనూ తలపడుతున్న ఇజ్రాయెల్ ఈ స్థాయిలో దాడులకు దిగడం ఇదే తొలిసారి. సోమవారం చేపట్టిన దాడుల్లో 356మంది ప్రాణాలు కోల్పోగా, వెయ్యి మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 24 మంది పిల్లలున్నారు. తాజా దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయని.. మరో పూర్తిస్థాయి యుద్ధం తప్పదని ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా జోక్యం చేసుకుంది. అగ్రరాజ్య రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్‌కు ఫోన్ చేశారు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు అండగా ఉంటామన్నారు. తమ బలగాలను రక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతూనే, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు తరలిపోతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. కాగా, ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవాలని లెబనాన్ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి, పెద్ద దేశాలను కోరింది. హిజ్బుల్లా, ఇజ్రాయెల్ ఎవరూ తగ్గడం లేదని వ్యాఖ్యానించిన ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరెస్.. లెబనాన్ మరో గాజాలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీతో సమావేశమైన ప్రధాని మోదీ

ఉక్రెయిన్ : ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీతో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం న్యూయార్క్‌లో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. దాదాపు నెల రోజుల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య ఇది రెండో సమావేశం.న్యూయార్క్‌లో ప్రెసిడెంట్ జెలెన్స్కీని కలిశానని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు గత నెలలో ఉక్రెయిన్‌లో మా పర్యటన ఫలితాలను అమలు చేయడానికి మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో వివాదాన్ని త్వరగా పరిష్కరించడం, శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడం కోసం భారతదేశం మద్దతును పునరుద్ఘాటించాం. ప్రధాని మోదీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీపై విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మూడు నెలల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య జరిగిన మూడో భేటీ ఇది. ద్వైపాక్షిక అంశాలతో పాటు రష్యా-ఉక్రెయిన్ వివాదానికి సంబంధించిన అంశాలపై వారు చర్చించారు. ఈ విషయాలపై భారత్ అభిప్రాయాన్ని అధ్యక్షుడు జెలెన్స్కీ ఎంతో ప్రశంసించారని తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన ఎంతో అభినందనీయమని, ఈ వివాదం నుంచి బయటపడేందుకు ప్రధాని మోదీ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు జెలెన్స్కీ. ద్వైపాక్షిక సంబంధాలు అనేక అంశాలపై సానుకూల పరిణామాలకు సాక్ష్యంగా ఉన్నాయని ఇరుపక్షాలు ప్రశంసించారు. ఇరువర్గాలు పరస్పరం సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకరించాయి. కాగా ప్రధాని మోదీ ఆగస్టు 23న ఉక్రెయిన్‌ను సందర్శించారు. ఉక్రెయిన్ వివాదంలో శాంతిని త్వరగా తిరిగి తీసుకురావడానికి సాధ్యమైన అన్ని విధాలుగా సహకరించాలని భారత్ సూచనగా పునరుద్ఘాటించారు. 1992లో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత భారత ప్రధాని ఉక్రెయిన్‌లో తొలిసారిగా పర్యటించిన సందర్భంగా అధ్యక్షుడు జెలెన్స్కీ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఉక్రెయిన్‌ను సందర్శించారు.

# దేశంలో తొలి క్లేడ్ 1బీ మంకీపాక్స్ కేసు

దిల్లీ: ప్రాణాంతక మంకీపాక్స్‌కు సంబంధించి భారత్‌లో మరో కేసు నమోదైంది. గత నెలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 'ఆరోగ్య అత్యయిక స్థితి'గా ప్రకటించిన క్లేడ్ 1బీ రకం మంకీపాక్స్ తొలి కేసు భారత్‌లో నమోదైనట్లు సోమవారం అధికారులు ప్రకటించారు. కేరళలోని మలప్పురం జిల్లాలో ఓ వ్యక్తికి ఈ వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలిపారు. యూఏఈ నుంచి ఇటీవల దేశానికి తిరిగి వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి గతవారం క్లేడ్ 1బీ రకం మంకీపాక్స్ సోకినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు. విదేశాల నుంచి తిరిగి వచ్చే వారిలో వ్యాధి లక్షణాలు కనపడితే ఆరోగ్యశాఖకు తెలియజేయాలని, వీలైనంత త్వరగా చికిత్స పొందాలని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ ప్రజలను కోరారు. కాగా అంతకుముందు హరియాణాలోని హిసార్‌లో ఓ 26 ఏళ్ల వ్యక్తికి దక్షిణాఫ్రికా క్లేడ్ 2 రకం మంకీపాక్స్ సోకిన విషయం తెలిసిందే.

### వాతావరణ శాఖ అలర్ట్..

# ఈ 13 రాష్ట్రాల్లో 27 వరకు భారీ వర్షాలు

మొదటి పేజి తరువాయి

రుతుపవనాలు వెళ్లిపోనున్నాయని చెబుతోంది. దేశంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, సబ్-హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కిం, గంగానది పశ్చిమంలో నైరుతి రుతుపవనాలు ఇప్పుడు బలహీనపడ్డాయని వాతావరణ కేంద్రం శనివారం తెలిపింది. బెంగాల్, జార్ఖండ్, బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, గుజరాత్ ప్రాంతం, సౌరాష్ట్ర, కచ్, కొంకణ్, గోవా, ఛత్తీస్‌గఢ్, రాయలసీమ, తమిళనాడు, దక్షిణ అంతర్గత కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో రుతుపవనాలు బలహీనపడినట్లు ఐఎండీ తెలిపింది. ఈ వారం పశ్చిమ రాజస్థాన్ మినహా వాయువ్య భారతదేశంలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కొంకణ్, గోవాలో సెప్టెంబర్ 26 వరకు, మధ్య మహారాష్ట్రలో సెప్టెంబర్ 27 వరకు, మరత్వాడాలో సెప్టెంబర్ 25 వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గుజరాత్ ప్రాంతంలో సెప్టెంబర్ 27 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రానున్న 3 రోజుల్లో ఒడిశా, అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, జార్ఖండ్‌లలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఈశాన్య భారతదేశంలో కూడా రాబోయే 2 రోజులలో మోస్తరు వర్షాలు పడవచ్చు. ఈ వారం విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. అదే సమయంలో, వచ్చే 7 రోజుల్లో మధ్యప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లలో సెప్టెంబర్ 26 వరకు, మధ్యప్రదేశ్‌లో సెప్టెంబర్ 27 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వారం కోస్తా కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలంగాణ, కోస్తాంధ్ర, యానాంలో సెప్టెంబర్ 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

# ఎప్పుడూ మన్ కీ బాత్ ముచ్చట్లే

మొదటి పేజి తరువాయి

కానీ ఏనాడూ తాను పూర్తిచేయాల్సిన కీలక బాధ్యతలను ప్రస్తావించరు. బాధ్యతలను విస్మరించారు. ఉద్యోగాల కల్పన, ధరల కట్టడి వంటి చేయాల్సిన పనులపై 'కామ్ కీ బాత్'ఏనాడూ చెప్పరు. గతంలో 56 అంగుళాల ఛాతి అంటూ గొప్పలు చెప్పుకుని తిరిగిన ఆనాటి మోదీ ఇప్పుడు లేరు. ఎందుకంటే ఆయన మూడ్‌ను లోక్‌సభ ఎన్నికల తర్వాత విపక్షాల 'ఇండియా'కూటమి మార్చేసింది. ప్రధాని మోదీ సైకాలజీని మా కూటమి దెబ్బకొట్టింది"అని రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్‌ను ఢిల్లీ ప్రభుత్వం కాకుండా స్థానికులే పాలించాలని రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసి మోదీ సర్కార్ నేరుగా పరిపాలిస్తున్న నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలుచేశారు. "కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)లను రాష్ట్రాలుగా మార్చారుగాగానీ రాష్ట్రాన్ని యూటీగా మార్చడం భారత చరిత్రలో ఎన్నడూ జరగలేదు. పూర్తిస్థాయి రాష్ట్రమైన జమ్మూకశ్మీర్‌ను యూటీగా మార్చి ఇక్కడి పౌరుల హక్కులను కాలరాశారు"అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సైతం పాల్గొన్నారు. "జమ్మూకశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా కోసం కేంద్రప్రభుత్వంతో పోరాడతాం. అయినా వాళ్లు ఇవ్వకపోతే మేం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మేమే హోదా ఇస్తాం. యూటీకాకమునుపు స్థానికులే కశ్మీర్‌ను పాలించేవారు. ఇక్కడి వారి భవిష్యత్తు, ప్రయోజనాలకనుగుణంగా నిర్ణయాలు జరిగేవి. ఇప్పుడు 'బయటి'వ్యక్తులు మీ గొంతుక వినకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నడిపిస్తోంది. మేం మీ ప్రభుత్వాన్ని జమ్మూకశ్మీరే నడపాలని కోరుకుంటున్నాం. మీ సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎలుగెత్తి చాటేందుకు మీ గొంతుకనవుతా"అని స్థానికులనుద్దేశించి రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండో దఫాలో 26 స్థానాలకుగాను సెప్టెంబర్ 25న జరగబోయే పోలింగ్‌కు ప్రచారం సోమవారంతో ముగిసింది. కుల గణన అనడానికి కూడా ప్రధాని మోదీ జంకుతున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, బీజేపీని విమర్శిస్తూ రాహుల్ సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో పలు పోస్టులుచేశారు. "బీజేపీ పూర్తిగా బహుజనుల వ్యతిరేక పార్టీగా తయారైంది. వాళ్లు ఎన్ని పుకార్లు పుట్టించినా, అబద్ధాలు వ్యాపింపజేసినా మేం మాత్రం రిజర్వేషన్లకు ఎలాంటి ముప్పు రానివ్వం. సమగ్ర కులగణన జరిగేదాకా మేం ఊరుకోం. సమాజంలోని ప్రతి వర్గానికి హక్కులు, వాటా, న్యాయం దక్కేలా చూస్తాం. అవసరమైతే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తేసి ఎక్కువ రిజర్వేష్లను కల్పిస్తాం. మోదీజీ కనీసం కులగణన అనడానికి కూడా భయపడుతున్నారు. బహుజనులకు న్యాయం దక్కడమనేది రాజకీయ అంశంకాదు అది నా జీవిత లక్ష్యం"అని రాహుల్ అన్నారు.

# సమిష్టి శక్తిలోనే మానవాళి విజయం

మొదటి పేజి తరువాయి

అంటూ సాగిన ఐదు నిమిషాల ప్రసంగాన్ని పలు దేశాధినేతలు హర్షధ్వానాలతో స్వాగతించారు. ఉగ్రవాదం ప్రపంచ శాంతికి, భద్రతకు పెను ముప్పుగా పరిణమించిందని మోదీ అన్నారు. మరోవైపు సైబర్, స్పేస్, మారిటైమ్ క్రైమ్ పెను సవాళ్లు విసురుతున్నాయని అభిప్రాయపడ్డారు. "వీటిని సమూలంగా రూపుమాపాలంటే కేవలం మాటలు చాలవు. నిర్దిష్ట కార్యాచరణతో ప్రపంచ దేశాలన్నీ కలిసి రావాలి. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా, సురక్షితంగా వినియోగించుకునేలా అంతర్జాతీయ స్థాయిలో నియంత్రణ వ్యవస్థ రావాలి" అని పిలుపునిచ్చారు. "మానవాళి సంక్షేమానికి ఆహార, ఆరోగ్య భద్రతకు దేశాలు ప్రాధాన్యమివ్వాలి. సంక్షేమ, సుస్థిరాభివృద్ధి పథకాల ద్వారా 25 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి విముక్తం చేశాం. వాటిని మిగతా దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నాం" అన్నారు. ప్రారంకోపన్యాసం చేసిన ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలపై మోదీ అభిప్రాయాలతో ఏకీభవించారు. వాటిని బాధ్యతాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రభావశీలంగా తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. ఐరాస భద్రతా మండలిని కాలం చెల్లిన వ్యవస్థగా అభివర్ణించారు! సరైన సంస్కరణలతో పనితీరును సరి చేసుకోకుంటే దాని విశ్వసనీయత అడుగంటడం ఖాయమని హెచ్చరించారు. ఘర్షణలకు ముగింపు కనుచూపు మేరలో కన్పించడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. "పట్టాలు తప్పుతున్న ప్రపంచాన్ని దారిన పెట్టేందుకు కఠిన నిర్ణయాలను, చర్యలను సూచించడమే లక్ష్యంగా సదస్సు జరిగింది" అన్నారు. మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టాల్సిన చర్యలతో కూడిన ఒప్పందాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సమగ్రాభివృద్ధి, అంతర్జాతీయ శాంతిభద్రతలు, శాస్త్ర సాంకేతికత, యువత, భావి తరాలు, అంతర్జాతీయంగా పాలన తీరుతెన్నుల్లో మెరుగైన మార్పులపై ఒప్పందం దృష్టి సారించింది.

# దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఏపీ అభివృద్ధికి రూట్ మ్యాప్

మొదటి పేజి తరువాయి

ఆయా రంగాల్లో సాధించిన అభివృద్ధి ద్వారా వచ్చిన సంపద సమాజంలో అన్నివర్గాలకు పంపిణీ చేయడమే అసలైన అభివృద్ధి అన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఎయిర్ పోర్టుగా నేడు హైదరాబాద్ ఎయిర్ పోర్టు అభివృద్ధి చెందిందని, దీనిద్వారా సృష్టించిన సంపదతో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జీఎంఆర్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం ద్వారా విశాఖపట్నంలో దేశంలోనే మెరుగైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మహా విశాఖ

విశాఖపట్నంను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ రాబోతుందన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది గతం మాట... ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలతో త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ పాలసీలు ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో యువ ఐఏఎస్ అధికారి సారథ్యంలో ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఈడీబీ)ను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. దీని ద్వారా సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా పరిశ్రమలకు అవసరమైన అనుమతులు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈడీబీ క్రియాశీలకంగా పని చేయబోతుందని, ప్రస్తుతం దేశంలో తొమ్మిదో అతిపెద్ద ఎకనమిక్ సిటీగా ఉన్న విశాఖను రాబోయే అయిదేళ్లలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు జీఎంఆర్ చేస్తున్న కృషిని లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యసాధనలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.



రూ.17 వేల కోట్లతో పోర్టుల అభివృద్ధి: మంత్రి జనార్దన్ రెడ్డి

రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వాన వేగవంతంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.17 వేల కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు, కాకినాడ గేట్ వే పోర్టులు శరవేగంగా నిర్మితమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ పైప్‌లైన్‌లో ఉందన్నారు. మౌలిక సదుపాయాల వృద్ధిలో భాగంగా ఎయిర్ కనెక్టివిటీ పెంచుతున్నామన్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం శరవేగంగా సాగుతోందని తెలిపారు. గ్లోబల్ మార్కెట్‌కు దీటుగా విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ ఇన్ ఫ్రాస్టక్చర్ అభివృద్ధి చేస్తామన్నారు.

పీపీపీ మోడ్‌లో క్రిటికల్ ఇన్‌ఫ్రా, హౌసింగ్ ప్రాజెక్టులు చేపడతామన్నారు. చంద్రబాబు మార్గనిర్దేశకత్వంలో ఇన్‌ఫ్రా అభివృద్ధిలో భాగంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. కొత్తగా గ్రీన్ ఫీల్డ్ పోర్టులు రాబోతున్నాయన్నారు.

18 నెలల్లో భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి: ఎంపీ భరత్

రాబోయే 18 నెలల్లో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో విశాఖపట్నం దేశంలో 10వ నగరంగా ఉండగా, ఎయిర్ కనెక్టివిటీ విషయంలో మాత్రం 27వ స్థానంలో ఉందన్నారు. ఈ గ్యాప్‌ను సరిదిద్దాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక విశాఖపట్నం నుంచి ఇంటర్నేషనల్ ఎయిర్ కార్గో ప్రారంభమైందన్నారు. వ్యక్తిగత విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా త్వరలో రాష్ట్రంలో పీఎం సూర్య పథకం ప్రారంభం కాబోతుందన్నారు. దీని ద్వారా విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు చౌకగా విద్యుత్ లభిస్తుందన్నారు. విశాఖ నగరంలో ఇప్పటికే ప్రారంభమైన ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై మంత్రి లోకేశ్ దృష్టిసారించి, వేగంగా పూర్తిచేసేందుకు సహకరించాలని కోరారు.

షీలానగర్-సబ్బవరం రోడ్డు విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని, అనకాపల్లి-భీమిలి రోడ్డు విశాఖపట్నం నగరం గుండా వెళ్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి 12 ఫ్లైఓవర్లను ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎలివేటెడ్ హైవే రోడ్డు నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. అధునాతన టెక్నాలజీతో హౌసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంత్రివర్గంలో యువ నాయకత్వంతో విశాఖ నగరం వేగవంతంగా అభివృద్ధి సాధించబోతోందని, ఇందుకు పారిశ్రామికవేత్తలు తమ వంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు.

# మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది..

మొదటి పేజి తరువాయి

మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది..

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీలోకి వెళ్తుంది. 94 శాతం స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మూసీ శుద్ధి ఎందుకు..? కొత్తగా మీరు శుద్ధి చేసేదేమీ లేదు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదు. సీఎం రూ. లక్షా 50 వేల కోట్లు అని అంటడు. మంత్రులేమో రూ. 50 వేల కోట్లు, ఇంకొందరేమో రూ. 70 వేల కోట్లు అని మాట్లాడుతున్నారు. ఈ మాటలను చూస్తుంటే అనుమానం వస్తుంది. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందని కేటీఆర్ తెలిపారు.

ఇప్పటిదాకా మీరు చెప్పినవి అబద్ధాలు అని తేలిపోయింది..

హైదరాబాద్‌లో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కట్టలేదు అని గతంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క మాట్లాడారు. నాడు తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గరుండి భట్టికి డబుల్ బెడ్రూం ఇండ్లు చూపించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 12 వేల ఆక్రమణలు ఉన్నాయని సీఎం చెప్పారు. వాటిని తొలగించి బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మేం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టకపోతే మీరు ఎక్కడ్నుంచి ఇస్తున్నారు..? ఇప్పటిదాకా మీరు చెప్పినవి అబద్ధాలు అని తేలిపోయింది. కేసీఆర్ చేసిన మంచి పనని ఒప్పుకోక తప్పట్లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.



పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు..

సబిత ఇంద్రారెడ్డి నేతృత్వంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం సేకరిస్తే దాన్ని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ అని, ఇంకోటి అని రకరకాల డ్రామాలు ఆడుతున్నారు. మూసీకి సంబంధించి మూసీ సుందరీకరణ పేరిట కొత్త నాటకాలు ఆడుతున్నారు. మీరు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయండి. రైతుభరోసా అందించండి.. పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు. హైదరాబాద్ ప్రజలకు మేం చేసిన పని బాగా తెలుసు. లింకు రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, స్మశాన వాటికలు, లైబ్రరీలు కట్టాం. ఇవన్నీ ప్రజల దృష్టిలో ఉన్నాయని కేటీఆర్ తెలిపారు.

పాకిస్తాన్ కంపెనీలకు మూసీ సుందీకరణ

మూసీ సుందీకరణ పేరుతో కుంభకోణం జరుగుతంది. దాన్ని కూడా బయటకు తీస్తాం. పాకిస్తాన్‌కు చెందిన కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలను గమనిస్తున్నారు. భవిష్యత్‌లో అన్ని విషయాలను ప్రజల దృష్టికి తీసుకువస్తాం. పేదలకు ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయం ఉంది. పేదోళ్లను బుల్డోజర్ల కింద నలిపేస్తున్నారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించండి.. ఆలస్యం చేయకండి. పుస్తకాల కోసం వేద శ్రీ మాట్లాడిన మాటలు వింటే గుండె బరువెక్కిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా నిరుద్యోగ సమస్య పోదు

హైదరాబాద్: ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య సమసిపోదని, కాబట్టి నిరుద్యోగ యువత డిమాండ్ - సప్లయ్ సూత్రాన్ని గుర్తుంచుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మాసాబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐను (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సురెన్స్) స్కిల్ ప్రోగ్రాం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా నిరుద్యోగ సమస్య తీరిపోదన్నారు. దీని తీవ్రతను తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రతి సంవత్సరం 3 లక్షల మంది పట్టాలు తీసుకొని బయటకు వస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడినట్లు తెలిపారు. ఎలాంటి కోర్సులు చదివిన వారు కావాలని అడుగుతున్నట్లు చెప్పారు. అయినప్పటికీ నిరుద్యోగ యువత డిమాండ్ - సప్లయ్ సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. డిగ్రీ చదివే వారు భవిష్యత్తు దిశగా ఆలోచన చేయాలన్నారు. కొందరు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడం లేదన్నారు. బ్యాంకులు, బీమా రంగాల్లో చాలా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. నాయకుడిగా రాణించాలన్నా నైపుణ్యం ముఖ్యమని తెలిపారు. ఉద్యోగం, ఉపాధి లేకుంటే యువత చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ విషవలయంలో చిక్కుకుంటున్నారని ఆవేదన చెందారు. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, కొన్ని కాలేజీల్లో అధ్యాపకులు, వసతులు ఉండటం లేదన్నారు. కాలేజీలను ఇలాగే రన్ చేస్తే వాటి గుర్తింపు రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా 60 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. డీఎస్సీ, గ్రూప్స్ విభాగాల్లో మరో 35 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. చదువుతో పాటు నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉండాలన్నారు.

# పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ ముమ్మాటికీ నేరమే

మొదటి పేజి తరువాయి

ఇలాంటి పనులకు తెగబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదంటూ మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టేసిన న్యాయస్థానం.. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని వ్యాఖ్యానించింది.

ధర్మాసనం ఏమన్నదంటే?

పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మార్చాలి. ఈ మేరకు పోక్సో చట్టానికి సవరణలు చేయాలి. పై సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దు. చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు స్టోర్ చేసిన వారికి తొలిసారిగా రూ. 5వేల వరకు జరిమానా విధించాలి. ఇలాంటి చర్యలకు మళ్లీ పాల్పడితే రూ.10 వేల వరకు జరిమానా వేయాలి. పిల్లల అశ్లీల వీడియోలను దురుద్దేశంతో ప్రసారం చేస్తే జరిమానాతో పాటు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించాలి. డబ్బుల కోసం చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రోత్సహించడం, ఆ వీడియోలను ప్రసారం చేస్తే మూడు నుంచి ఐదేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి. గరిష్ఠంగా ఏడేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి.

### ఏమిటీ కేసు?

చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏండ్ల ఓ యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. సదరు యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది.

పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకొన్నాడంటే, ఆ దురుద్దేశం యువకుడికి ఉందన్నది స్పష్టమవుతున్నదని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

లైంగిక విద్యపై అపార్థాలు ఉన్నాయి: సుప్రీంకోర్టు

ఈ కేసు విచారణ సందర్భంగా లైంగిక విద్యపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'తల్లిదండ్రులు, అధ్యాపకులు సహా చాలా మంది శృంగారం గురించి చర్చించడం సరికాదని, అనైతికమని, ఇబ్బందికరమనే సంప్రదాయవాద భావాలు కలిగి ఉన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాశ్చాత్య అంశమని, సంప్రదాయ భారతీయ విలువలకు తగనిదనే భావన ఉంది. ఈ భావనతోనే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సెక్స్ ఎడ్యుకేషన్‌ను నిషేధించాయి. ఈ రకమైన వ్యతిరేకత తో సమగ్ర, సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్ అందకపోవడం వల్ల కౌమార దశలో ఉన్న వారికి తప్పుడు సమాచారం వెళ్తున్నది. వారు ఇంటర్నెట్ వైపు వెళ్లి నియంత్రణ లేని సమాచారం పొందుతున్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అంటే కేవలం జీవపరమైన పునరుత్పత్తి మాత్రమే అనే అపార్థం ఉంది. సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్‌లో అంగీకారం, ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం వంటి అంశాలు ఉండాలి. శారీరక హింసను తగ్గించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ఇవి కీలకం' అని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు.

# పిల్లల కోసం నీళ్లు అడిగితే ఇవ్వలేని పరిస్థితి చూశా..

'మూడు రోజులుగా మంచినీళ్లు లేవు.. పిల్లల కోసం మీరు నీళ్లు పంపించగలరా' అంటూ వరద బాధితులు అడిగితే ఓ సీఎంగా మంచినీళ్లు పంపించలేని పరిస్థితిని ఎదుర్కొన్నానంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడలో వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికార యంత్రాంగంతో పాటు తాను కూడా స్వయంగా వెళ్లి వరద బాధితులను కలిశానని చెప్పారు. బాధితులు పెద్ద కోరికలు అడగలేదని, తాగడానికి అది కూడా పిల్లల కోసం మంచినీళ్లు అడిగారని గుర్తుచేసుకున్నారు. వెంటనే అధికారులను పంపించి లక్షలాది వాటర్ బాటిళ్లను సేకరించి పంచామని చెప్పారు. మొత్తంగా కోటికి పైగా వాటర్ బాటిళ్లను పంచామని చెప్పారు. విజయవాడ వాసులు ఎదుర్కొన్న విపత్తును తన జీవితంలో ఇంతవరకూ చూడలేదని చంద్రబాబు చెప్పారు. ఓవైపు ఒకేచోట కుండపోతగా కురుస్తున్న వర్షం (క్లౌడ్ బరస్ట్), మరోవైపు బుడమేరుకు కనీవినీ ఎరుగని వరద వచ్చిందని చెప్పారు. బుడమేరు గండ్లను పూడ్చడానికి అధికార యంత్రాంగం పగలూరాత్రి కష్టపడిందన్నారు. రోజుల తరబడి వరదల్లోనే అధికారులు, మంత్రులతో పాటు తాను కూడా తిరిగానని చెప్పారు. బాధితులకు మనోధైర్యం ఇస్తూ ముందుకు సాగామన్నారు. రోజుల తరబడి తాను కలెక్టరేట్ లోనే ఉండి ఎప్పటికప్పుడు వరద సాయంపై పర్యవేక్షణ చేశానన్నారు. డ్రోన్లను, ఫైరింజన్లను, ప్రొక్లెయిన్లను ఉపయోగించి బాధితులను ఆదుకున్నామని చెప్పారు.

దాతలకు పాదాభివందనాలు..

సీఎం రిలీఫ్ ఫండ్ కు రికార్డు స్థాయిలో విరాళాలు వచ్చాయని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. తొలిసారిగా సీఎం రిలీఫ్ ఫండ్ కు 400 కోట్ల రూపాయలు విరాళం అందిందన్నారు. వరద బాధితుల పరిస్థితి చూసి స్పందించి విరాళం పంపిన దాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. దాతలకు పాదాభివందనం చేస్తున్నానని చెప్పారు. మానవతా దృక్పథంతో స్పందించారని చెబుతూ... వీల్ చెయిర్ పై వచ్చి, అమెరికా నుంచి ఫోన్ చేసి ఇక్కడ ఉంటున్న వారిని స్వయంగా పంపించి చెక్కులు అందజేశారని తెలిపారు. స్కూలు పిల్లలు కూడా ఐదు, పది రూపాయలు, కిడ్డీ బ్యాంకులు పగలకొట్టి డబ్బులు తెచ్చిచ్చారని వివరించారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెబుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. సంఘటితంగా ముందుకు వస్తే విపత్తులను ఎదుర్కోవచ్చని చాటిచెప్పారని దాతలను కొనియాడారు.

వరద బాధితులకు అందజేసినవి..

14 కోట్ల వాటర్ బాటిళ్లు, 37 లక్షల మిల్క్ బాటిళ్లు, 47 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 5 లక్షల కోడి గుడ్లు, 3.50 లక్షల క్యాండిల్స్, 2.30 లక్షల మ్యాచ్ బాక్సులు

1.15 కోట్ల ఆహార ప్యాకెట్లు, 5 వేల క్వింటాళ్ల కూరగాయలు. దాదాపుగా 75 వేల ఇళ్లను, 330 కిలోమీటర్ల మేర రోడ్లను ఫైర్ డిపార్ట్ మెంట్ సిబ్బంది క్లీన్ చేశారు. 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శానిటేషన్ డిపార్ట్ మెంట్ సిబ్బంది తొలగించారు.

## వరదయ్యపాలెం జెడ్పీఉన్నత పాఠశాలలో ఘనంగా నియోజకవర్గస్థాయి ఖోఖో క్రీడా పోటీలు



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ):దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసే క్రీడల్లో విద్యార్థులు జాతీయస్థాయి క్రీడాకారులుగా ప్రతిభ చాటి సత్తా చాటాలని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, జెడ్పటీసీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.వరదయ్యపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల సలహా కమిటీ



చైర్మన్ పి.ఉదయ్ కుమార్ అధ్యక్షతన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు సంఘం వైస్ ప్రెసిడెంట్ బందిలకుమార్ ఆద్వర్యంలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రీడా (ఖోఖో) పోటీలలో ఏడు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ నియోజవర్గ ఖోఖో ఫైనల్ పోటీల్లో సీనియర్ బాలురు ( యు/17) విభాగంలో విన్నర్ గా సత్యవేడు మండలం, రన్నర్ గా వరదయ్య పాలెం మండలం నిలిచింది. జూనియర్ బాలుర విభాగంలో(యు /14)సత్యవేడు మండలం విన్నర్ కాగా వరదయ్య పాలెం మండలం రన్నర్ గా నిలిచింది సీనియర్ బాలికల (యు/17)విభాగంలో వరదయ్యపాలెం మండలం విన్నర్ కాగా సత్యవేడు రెండో స్థానంలో రన్నర్ గా నిలచింది. జూనియర్ బాలికల(యు /14)విభాగంలో వరదయ్యపాలెం మండలం విజేతగా నిలవగా నారాయణవనం మండలం రన్నర్ గా నిలిచింది.జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం వైస్ ప్రెసిడెంట్ కిషోర్, పుట్టూరు డివిజన్ పి ఈ టి సంఘం ప్రెసిడెంట్ భక్త గోపాల్ నియోజకవర్గ పిఈటి లు ముద్దుకృష్ణ, వినోద్ మనోహర్ సురేంద్ర మస్తాన్ కిషోర్, మణి, నాగరాజు, దాసు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది మన మంచి ప్రభుత్వం..



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ):ముఖ్యఅతిథిగా పాల్గొన కూటమి పార్టీల ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీపతి బాబు తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు ఐనా సందర్బంగా సి ఎల్ ఎన్ పల్లి పంచాయతీ మిట్ట హరిజన వాడ లో నేడు ఉదయం 10:00 గంటలకు



మండల ఎంపీడీఓ, రెవిన్యూ, కరెంట్, విద్య, నీరు మరియు వివిధ శాఖల కార్యాలయాలకు సంభందించిన పలు అధికారుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పి. యుగంధర్ రెడ్డి %ు% మండల కూటమి నాయకులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇ కార్యక్రమంలో ప్రజలు తమ గ్రామాలలోని వ్యక్తిగత, కుటుంబ మరియు అనేక సమస్యల పరిష్కారం కొరకు అభ్యర్ధనలను కుడా తెలుపుకున్నారు.

## క్యాన్సర్ బాధిత చిన్నారికి వై ఎన్ ఆర్ చారిటీస్ ఆపన్న హస్తం



విజయవాడ (శుభోదయం న్యూస్ )వెస్ట్ రిపోర్టర్ : బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారికి వైఎన్ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. మధురానగర్ లో నివాసముంటున్న చిన్నారి కీర్తన గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది. నిరుపేద కుటుంబం అయిన తమకి సాయం అందించాలని వై ఎన్ ఆర్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ ను చిన్నారి కుటుంబ సభ్యులు సంప్రదించగా ఆయన సానుకూలంగా స్పందించారు. బుధవారం పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ సుజనా చౌదరి చేతుల మీదగా తాడిగడపలోని తమ కార్యాలయంలో రూ 50 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు,యలమంచిలి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లి వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలిపిన కనిగిరి నియోజకవర్గ జడ్పీటీసీలు





కనిగిరి ఆర్సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా ఉక్కు మహిళ మా పెద్దమ్మ జెడ్పి చైర్ పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ తన మూడేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని, నాల్గవ వసంతంలోకి అడుగుతున్న సందర్భంగా బుధవారం జడ్పీ ఆఫీసులో కనిగిరి జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తీరుపతిరెడ్డి, మరియు కనిగిరి నియోజకవర్గ వైసిపి నాయకులు సంగటి మహేంద్ర రెడ్డి, పోలక సిద్ధారెడ్డి, వెంకటేశ్వర్లు, శశి కలిసి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలుతెలిపారు.

## సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలిఎమ్మెల్యే సుజన చౌదరి



విజయవాడ (శుభోదయం న్యూస్ )పశ్చిమ రిపోర్టర్ :తోటి వారికి సాయపడాలనే మంచి మనసుతో వరద బాధితుల సహాయార్థం నిత్య అవసరాలను అందిస్తున్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్, రామకృష్ణ సేవాశ్రమ సేవలు అభినందనీయమని పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ సుజన చౌదరి అన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ సేవాశ్రమ సారధ్యంలో బుధవారం ఊర్మిళా నగర్ లోని హెచ్2ఓ ఫంక్షన్ హాల్ లో వరద బాధితులకు నిత్యవసరాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుజనా హాజరై బాధితులకు నిత్య అవసరాలను తమ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం సుజనా మాట్లాడుతూ వరదల వల్ల నిరాశ్రయులైన బాధితులను ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో మేము సైతం అంటూ ముందుకు వచ్చిన సంస్థల సేవలు అభినందనీయమన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యాలు కావాలన్నారు. ప్రభుత్వాలు చేతనైనంత సాయం మాత్రమే చేస్తాయని ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయ పడాలన్నారు. వరద విపత్తు సమయంలో పశ్చిమ ప్రజలకు సుజనా ఫౌండేషన్ సిబ్బంది , కార్యాలయ సిబ్బంది, కూటమినేతల సహకారంతో వేగవంతంగా సేవలను అందించామన్నారు. శాసనసభ్యునిగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న దసరా పండుగ ఎంతో ప్రత్యేకమైనదని దసరా ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బాధితులకు నిత్య అవసరాలను పంపిణీ చేసిన ఇన్ఫోసిస్ మమతా ఫౌండేషన్, శ్రీరామకృష్ణ సేవాశ్రమ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శ్రీరామకృష్ణ సేవాశ్రమ స్వామి జపానంద మహారాజ్ వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రకృతి విపత్తు వలన ఈ ప్రాంతానికి వరదలు రావడం బాధాకరమైన విషయం అన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా శ్రీరామకృష్ణ సేవాశ్రమం నేతృత్వంలో పశ్చిమ లోని వరద బాధితులకు 2000 వేల మందికి నిత్యవసర కిట్లను అందజేశామన్నారు. టవళ్లు, చీరలు, దుప్పట్లు, కందిపప్పు రైస్, నూనె, గోధుమపిండి తదితర నిత్య అవసరాలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు చంద్రమౌళి, సతీష్, అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, దుర్బేసుల హుస్సేన్, బొమ్మసాని సుబ్బారావు ఇన్ఫోసిస్ మమత ఫౌండేషన్ సీనియర్ డెలివరీ ఇంచార్జ్ వంశీ పరంజ్యోతి, దేవన బోయిన వెంకట్ కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీ స్వచ్ఛత కొరకు ఒక్క అడుగు



కనిగిరి ఆర్సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్) :కనిగిరి పురపాలక సంఘం, మెప్మా, గుడ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీ ని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కనిగిరి పట్టణం పురపాలక సంఘం కార్యాలయం నుంచి



పామూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. రామాలయం వీధి వద్ద మానవహారం నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోషఫ్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్,హెల్త్ ఇన్స్పెక్టర్ చెన్నకేశవులు,ఎ.ఈ కోటేశ్వరరావు,సి.ఎమ్. ఎమ్ రఘు,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ రమేష్ బాబు, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్,మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్




తనకల్లు, ( శుభోదయం న్యూస్): తనకల్లు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బుధవారం మండల ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మురళి స్వామి,మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులను చాలా నీచంగా చూశారని, ఉపాధ్యాయుల చేత బ్రాందీ షాపుల వద్ద, సినిమా థియేటర్ల వద్ద, విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీచేసి ఉపాధ్యాయుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని, అటువంటిప్రభుత్వం కూలిపోవడానికిపరోక్షంగా ఉపాధ్యాయులందరూ కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు శివశంకర్, మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 117 జీవోను రద్దుచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని తమ హక్కుల కోసం పోరాడితే హౌస్ అరెస్టులు చేసిందని విజయవాడలో ధర్నా చేయడానికి ప్రయత్నించిన ఉపాధ్యాయులను తీవ్రంగా అణచివేసిందని అటువంటి పరిస్థితులు మా ప్రభుత్వంలో ఉండవని వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అ%ూ%ది స్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులను ఎంపిక చేశారు. మండల గౌరవ అధ్యక్షులుగా మురళి స్వామి, మండల అధ్యక్షులుగా శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, రోజాలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లలితమ్మ, కళ్యాణి, హరీంద్ర ప్రసాద్, రోజా, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



తనకల్లు, (శుభోదయం న్యూస్): తనకల్లు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పి.మల్లికార్జున. ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోంపాల్యం నాగభూషణ మాట్లాడుతూ తెలంగాణ రజాకారుల మీద తిరగబడి సాహిద పోరాటం చేసి తన సత్తా చాటిన దీరవనిత చాకలి ఐలమ్మ, జయంతిని మండల కేంద్రంలో జరుపుకోవడం ఆనందాన్నిస్తోందని, అటువంటి ఉద్యమకారుల చరిత్ర భావితరాలకు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉంటుందని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెం అశోక్, మాజీ ఎంపీటీసీ మహబూబ్ బాషా, ఎస్సీ సెల్ చిన్నప్ప, రైతు సంఘం రమణ, పులి మహేష్, ఓబులేసు, బ్యాంకు రెడ్డప్ప, నరేంద్ర,జానకిరామ్, రాముడు, నారాయణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టి జాబితాలోకి చేర్చాలి -వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెం అశోక్ డిమాండ్



తనకల్లు, ( శుభోదయం న్యూస్): వాల్మీకులను ఎస్టి జాబితాలోకి చేర్చి వారి సాధికారతకు పాటుపడాలని కొక్కంటి క్రాస్ కు చెందిన వాల్మీకి జిల్లా అధ్యక్షుడు మల్లెం అశోక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఈరోజు బాలసముద్రంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు అర్జీ ఇచ్చి విన్నవించారు. చాలా సంవత్సరాలుగా వాల్మీకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ,వారిని గిరిజన జాబితాలోకి చేర్చి వారి సంక్షేమానికి పాటుపడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వందరోజుల పాలనలో అందరూ సంతోషమే - ఎమ్మెల్యే ఇంటూరి



లింగసముద్రం మండలం, (శుభోదయం న్యూస్ ): వంద రోజుల పాలనలో వందకు పైగా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం మన మంచి ప్రభుత్వం. నాయకుల్లాగా కాకుండా సేవకుల్లాగా పని చేస్తాం కాబట్టే ఇది మంచి ప్రభుత్వం అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో పాల్గొన్న ఆయన పాల్గొన్నారు.తొలిత పంచాయతీలోని అంబేద్కర్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు.కోటయ్య సమాధి సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి అక్కడినుండి తహసిల్దార్ కార్యాలయం వరకు గుర్రం మీద ఎక్కి ఊరేగింపుగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో దారుణపరిస్థితులు చూసిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు,జగన్ పాలన పట్ల విసుగు చెంది ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపగలిగే సత్తా, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న అభివృద్ధి ప్రదాత శ్రీ నారా చంద్రబాబు నాయుడు కూటమి పార్టీలకు పూర్తి అధికారం అందించారని ఎమ్మెల్యే తెలిపారు.40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవంగల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి రాష్ట్రాన్ని సంక్షేమ అభివృద్ధి పథంలోకి తీసుకు వెళుతున్నారని గుర్తుచేశారు.వరదల్లో చిక్కుకున్న ప్రజల కోసం దాదాపు 10 రోజుల పాటు దగ్గరుండి వారికి సేవలు అందించిన గొప్ప వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు.అవ్వ తాతలకు పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడం ఒకటైతే మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000లు చొప్పున ఒకేరోజు 65 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4,400 కోట్లు పంపిణీ చేసి దేశంలోనే తిరుగులేని చరిత్ర సృష్టించారన్నారు.ఎంతో మంది పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటిన్ ను పునః నిర్మాణం చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడు దేనని అన్నారు.వైసిపి ప్రభుత్వం ప్రజలకు నిద్ర లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించమన్నారు. మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందన్నారు. ఈ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తాం, రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తాం, చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుంది. వెనక్కి వెళ్లిన కంపెనీలన్నీ తిరిగి వస్తాయన్నారు. లింగసముద్రం మండలంలో గత ఐదేళ్లలో రాక్షస పాలన కొనసాగిందని,తెలుగుదేశం పార్టీ నాయకులను అనేక ఇబ్బందులకు గురి చేశారని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో టిడిపి కార్యకర్త మిరపతోటను ధ్వంసం చేస్తే, కనీసం కేసు కట్టలేదని అన్నారు.కానీ తాము ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడతామని తెలిపారు.24 గంటల పాటు ప్రజల మధ్యలోనే ఉంటూ,ప్రజల కోసం పనిచేస్తానని,రాబోయే ఐదేళ్లలో గ్రామాల్లో వంద శాతం సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.14 డ్వాక్రా సంఘాలకు 2.48 కోట్ల రుణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.తాహశిల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటారు.అంతకుముందు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంగళాపురం గ్రామం దగ్గర బాణాసంచాలు కాలుస్తూ పూలు చల్లుతూ,డప్పు వాయిద్యాల మధ్య టిడిపి, జనసేన,బిజెపి నేతలు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసిల్దార్ సీతామహాలక్ష్మి,మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాల రావు, మాజీ ఎంపీపీ గూడూరి కల్పనా రంగనాథ్,గ్రామ టిడిపి అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, సర్పంచ్ పులి పెదరాఘవులు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొణిదల శ్రీనివాసులు, టిడిపి నాయకులు రాజారపు మాలకొండయ్య, గొర్రెపాటి సాంబయ్య, కూరపాటి శ్రీనివాసులు, సయ్యద్ నాయబ్ రసూల్,మండల స్థాయి అధికారులు,మండలంలోని వివిధ గ్రామాల నాయకులు హాజరయ్యారు.

## బాధ్యతలు చేపట్టిన ఎస్సై గోపిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు



తనకల్లు, (శుభోదయం న్యూస్): తనకల్లు పోలీస్ స్టేషన్ కు నూతనంగా బాధ్యతలు చెప్పట్టిన ఎస్సై కె. గోపి ను బుధవారం తనకల్లు పోలీస్ స్టేషన్లో ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగ కలిశారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డి భాష మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై కి శు భాకాంక్షలు తెలియజేసి అన్నివేళలా మా వంతు సహాయం చేస్తామని ఆయన అన్నారు.


# చంద్రబాబుతో డాక్టర్ నూకసాని

నూకసానికి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



లింగసముద్రం మండలం, (శుభోదయం న్యూస్ ):ఏపీ టూరిజం డెవలపమెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీకి మండలంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేముల గోపాలరావు,మాజీ ఎంపీపీ గూడూరి కల్పనా రంగనాథ్,మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బోడి సురేష్ యాదవ్, చిట్టి బోయిన సుధాకర్ యాదవ్, బచ్చు మాల్యాద్రి,హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అధినేత నిర్ణయాలకు కట్టుబడి పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేసిన డాక్టర్ బాలాజీకి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడంతో ఆయనకు మంచి గుర్తింపు దక్కిందని టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పొలం పిలుస్తోంది - రైతు ముంగిట వ్యవసాయ విస్తరణ సేవలు



తనకల్లు, (శుభోదయం న్యూస్): తనకల్లు మండలం బాలసముద్రం మరియు గోవిందు వారి పల్లిలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కందికుంట వెంకటప్రసాద్ పొలం పిలుస్తుంది కార్యక్రమానికి హాజరైనారు. రైతులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని నూతన పద్ధతిలో అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందాలని పండించిన వ్యవసాయ ఉత్పత్తులను విలువ జోడింపు ద్వారా మంచి మార్కెటింగ్ పొంది అధిక ఆదాయాన్ని పొందగలరని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్తల తగు సూచనలు సలహాలు వివిధ పంటలపై పొంది రెట్టింపు ఆలయాన్ని పొందాలని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొలం సందర్శనలో భాగంగా రైతు



టి.గోవిందరము సాగుచేసిన వేరుశనగ పొలాన్ని సందర్శించి పంటను పరిశీలిస్తూ తగు సూచనలు శాస్త్రవేత్తలు ఇవ్వడం అయినది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను అనగా జనజగృతి సంస్థ ప్రకృతి వ్యవసాయం ప్రదర్శన నాల, పట్టుపరిశ్రమ ప్రదర్శనశాల, పశుసంవర్ధక శాఖ ప్రదర్శన శాల, వ్యవసాయశాఖ ప్రదర్శనశాఖ, ఉద్యాన శాఖ ప్రదర్శన శాల, ప్రకృతి వ్యవసాయం ప్రదర్శనశాల, ఐసిడిఎస్ స్టాళ్లను గౌరవ శాసనసభ్యులు సందర్శించి నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఉలవలు విత్తనాలు,కౌలు రైతుల కార్డులను రైతులకు గౌరవ శాసనసభ్యుల ద్వారా పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు.నరసింహులు(బ్రీడింగ్) కదిరి పరిశోధన స్థానం నుండి హాజరై రైతులతో ముఖాముఖి కార్యక్రమన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎస్ సత్యనారాయణ ఏడిఏ రెగ్యులర్ కదిరి, మండల వ్యవసాయ అధికారి . శ్రీహరీ నాయక్ మరియు జనజాగృతి సంస్థ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి గారు అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు, అనుభంద శాఖలు ఐన ఉద్యాన పశుసంవర్ధక శాఖ, పకృతి వ్యవసాయ సంబంధిత అధికారులు, జనజాగృతి సంస్థ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


# ప్రకాశం విద్యార్థులకు ఎన్.ఎన్.సి అధికారుల ప్రశంసలు





కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ నుండి ఎన్.ఎన్.సి కాడేట్స్ గా మరో 25 మంది ఎంపికైనట్లు ఎన్.ఎన్.సి అధికారులు వెల్లడించారు. 2024-25 వ సంవత్సరానికి 25 మందికి ఖాళీలు ఉండగా 100 మందికి పైగా ఎంపికల్లో పాల్గొన్నారు ఇందులో 8 మంది బాలికలు,17 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఎన్.సి ఆఫీసర్ 34 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోహన్, సబ్ మేజర్ పుష్పరాజు, సుబేదార్ సంతోష్ సింగ్, హవల్దార్ పీతాంబర్ శ్రేష్ఠ,లు ఆధ్వర్యంవహించారు. ప్రకాశం ఎన్.ఎన్.సి ఆఫీసర్ హిమామ్ షా, సంతోష్ ల తో పాటు కాలేజీ ఎన్.ఎన్.సి ఇన్ చార్జ్ ఎస్.ఎన్.మీరావలి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు 1,05,232/- విరాళాలు అందజేత




కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుతో.... విజయవాడ వరద బాధితులకు తమవంతుగా పలువురు సాయంచేస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. లింగసముద్రం మండలం యర్రారెడ్డిపాలెం గ్రామ టిడిపి నాయకుడు రాజవరపు మాలకొండయ్య 25,116/-లింగసముద్రం గ్రామానికి చెందిన టిడిపి నేత దేవకి సుబ్రహ్మణ్యం 10,000/-



లింగసముద్రం మండలం పెదపవని గ్రామానికి చెందిన షేక్ రఫీ 10,000/-షేక్ కరీముల్లా 10,000/-సయ్యద్ మాబు 10,000/-షేక్ హమద్ 10,000/-సయ్యద్ నాయబ్ 10,000/-కందుకూరు పట్టణం కోటారెడ్డి నగర్ కు చెందిన ద్రోణాదుల వెంకటేశ్వర్లు 10,000/- విరాళాన్ని వరద బాధితుల కోసం... ఈరోజు ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారికి అందించారు. అలాగే ద్రోణాదుల వెంకటేశ్వర్లు, అన్న క్యాంటీన్ కోసం 10,116/- లను ఎమ్మెల్యేకు అందజేశారు.మొత్తంగా ఈ రోజు 1,05,232/- విరాళాలను దాతలు అందజేయడం జరిగింది. వీరందరినీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభినందించారు.

# జిల్లా స్థాయి జోనల్ కు నారాయణ విద్యార్థి ఎంపిక




కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):జిల్లా పరిషత్ బాలుర పాఠశాల కందుకూరు నందు జరిగిన 100 మిటర్ పరుగు పందెం నందు నారాయణ ఇ టెక్నో స్కూల్ విద్యార్థి జి.రిషి రాహూల్ జిల్లా స్థాయి కి ఎంపిక కావడం జరిగింది దినీ యందు ప్రిన్సిపాల్ అనీష్ బాబు ఎ జి ఎం పెద్ది రెడ్డి. ఆర్ ఐ విజయ లక్ష్మి ఎ ఓ అశోక్ అకడమిక్ డీన్ జాని వ్యాయామ ఉపాధ్యాయుల యం సాగర్ పాల్గొని అభినందించడం జరిగింది.

## అభివృద్ధి పనులు చెయ్యడమే టిడిపి ప్రభుత్వ ధ్యేయం.. తిమ్మ గురుడు ఆలయ కమిటీ చైర్మన్ అప్ప వేణుగోపాల్ రాయల్..



తుగ్గలి, సెప్టెంబర్ 25 (శుభోదయం న్యూస్): గ్రామాలలో అభివృద్ధి పనులు చేయడమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని బోడబండ తిమ్మ గురుడు ఆలయ కమిటీ చైర్మన్ అప్ప వేణుగోపాల్ రాయల్, సూర్య తండ సర్పంచ్ సలహాదారుడు శంకర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ రాము నాయక్ లు అన్నారు. బుధవారం ఉప్పర్లపల్లె, సూర్య తాండ, మీటే తాండ ల లో తెలుగుదేశం ప్రభుత్వం 100 రోజులలో చేసిన మంచి పనుల ను వారు సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోనే ప్రజల కు తెలుగుదేశం ప్రభుత్వ మంచి పాలన అందిస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయడం



జరుగుతుందన్నారు. పింఛన్లను లు రూ 4 వేల కు పెంచడం ,వికలాంగుల పింఛన్లు రూ 6 వేలు కు పెంచడం, అన్న క్యాంటీన్లో ఏర్పాటు చేయడం, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ప్రకటించడం తదితర మంచి పనులు చేయడం జరిగిందని ప్రజలకు వివరించారు. అలాగే ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు నిత్యం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మనోహర్, తిరుపాల్ నాయక్ ,లక్ష్మణ్ నాయక్ ,పశువైద్యాధికారి డాక్టర్ ప్రాణహిత ,పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, హెల్త్ కార్యదర్శి పుష్పలత, ఎపిఎం రాధాకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు పరిదప్ప, జయచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మణ్ నాయక్ ,విజయ్ నాయక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# డి లంక మల్ల అటవీ ప్రాంతంలో కూంబింగ్, అటవీ క్షేత్ర అధికారి కళావతి



సిద్ధవటం, సెప్టెంబర్ 25(శుభోదయం న్యూస్) : సిద్ధవటం మండలం లంకమళ్ళ అభయారణంలో బుధవారం అటవీ క్షేత్ర అధికారి కళావతి ఆధ్వర్యంలో గొల్లపల్లి బీట్ నందు సమస్య ఆత్మక ప్రదేశాలకు నిర్వహించారు ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి మాట్లాడుతూ కొండూరు సంపద కొల్లగొట్టే వారిపై ఆచూకీ కోసం కూంబి నిర్వహించామని మరికొన్ని రోజులు సిద్ధవటం అటవీ ప్రాంతంలో కొన్ని అనుమానితుల ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహిస్తామని ఆమె తెలిపారు ఎవరైనా కొత్త వ్యక్తులు పల్లె ప్రాంతాలలో సంచరిస్తే మాకు సమాచారం తెలపాలని అటవీ ప్రాంతంలో చెట్లను ఎవరు కొట్టకూడదని రాత్రి వేళల్లో కూడా కొన్ని ప్రదేశాల్లో గట్టి నిగ ఉంచామన్నారు పాత నేరస్తుల కదలికలు ఎప్పటికప్పుడు అన్ని సమాచారం తీసుకుంటూ వారిపై కూడా నిఘా ఉంచామని అటవీ శాఖ అధికారి కళావతి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఓబులేష్, ఎఫ్బి ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జూడో పోటీలో వడ్డాది విద్యార్థికి ద్వితీయ స్థానం



బుచ్చియ్యాపేట (శుభోదయం న్యూస్):రాష్ట్ర స్థాయి అండర్ 14 జూడో పోటీలు ఈనెల 22,23న తిరుపతిలో జరిగాయి. ఈ పోటీలకు బుచ్చయ్యపేట మండలం వడ్డాది శ్రీ కోవెల అప్పన్న దొర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బాలుర 40 కేజీల విభాగంలో 8వ తరగతి చదువుతున్న గోడ చరణ్ అనే విద్యార్థికి రాష్ట్రస్థాయిలో రజత పథకం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. దీంతో మండలంలోని వడ్డాది హై స్కూల్ కు ఇంత మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన విద్యార్థులను పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు వి.వెంకట్రావు అభివృద్ధి కమిటీ చైర్మన్ కోవెల వెంకటరమణ ఏపీటిఎఫ్ లీడర్ ఎస్. వి. సత్యనారాయణ తదితరులు పాఠశాల క్రీడా మైదానంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారావుతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

# వడ్డాదిలో పొలం పిలుస్తుంది



బుచ్చియ్యపేట (శుభోదయం న్యూస్): వరి చేను చీడపీడల నుండి నివారించడానికి ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి భాస్కరరావు తెలిపారు. బుచ్చియ్యపేట మండలం వడ్డాది లో బుధవారం ఆయన పొలం పిలుస్తుంది అని కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వ్యవసాయ అధికారి వారి సిబ్బంది పంట పొలాలను పరిశీలించారు. పంటలను ఆశించిన చీడపీడలు వ్యవసాయ స్థితిగతులు క్షేత్రస్థాయిలో వివరంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గా ఆయన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెట్టుబడులు తగ్గించుకునే విధానాలు, దిగుబడులు పెంచుటకు అవలంబించవలసిన సాంకేతిక పరిజ్ఞానం గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతము వరిపై ఎటువంటి చీడపీడలు ఆశించలేదని, ముందు జాగ్రత్తగా అనవసరమైన మందులు పిచికారి చేసి పెట్టుబడులు పెంచుకోవద్దని వ్యవసాయ అధికారి సూచించారు. నాణ్యమైన దిగుబడుల కోసం, చీడపీడలు తట్టుకునే శక్తి కోసం యూరియాతోపాటు పొటాష్ కలిపి బూస్టర్ డోసుగా వేయాలని సూచించారు సస్యరక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యగా కేవలం వేప నూనె పిచికారి చేస్తే సరిపోతుందని ,ఒక లీటర్ నీటిలో ఐదు మిల్లి లీటర్ల వేప నూనె చొప్పున కలిపి ఎకరాకి 200 లీటర్ల మందు నీటిని పిచికారిచేయాలని తెలిపారు. చీడపీడలు లేనప్పటికీ వాటి అభివృద్ధికి అనుకూలంగా వాతావరణం ఉన్నందున రైతులు కనీసం రెండు దినములకు ఒక్కసారైనా పొలాలను పరిశీలించి నిపుణుల సలహా మేరకు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలనీ అన్నారు మైక్రో ఇరిగేషన్ కొరకు అనగా స్ప్రింక్లర్లు డ్రిప్పు కావలసిందకావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవలసిందిగా మైక్రో ఇరిగేషన్ అధికారి కోరి ఉన్నారు. ప్రజా ప్రతినిధులు రైతులు కస్పా ఛానల్ సుమారు రెండున్నర కిలోమీటర్లు పొడవునా లోపల వైపు సిమెంటు లైనింగ్ అవసరం అని. బండ్ల రేవు దగ్గర, కొత్తచెరువు మొగసాలు వద్ద నీరు వృధాగా పోకుండా ఉండడానికి లాకులు ,షట్టర్లు ఏర్పాటు చేయవలసిందిగా ఇరిగేషన్ విభాగం వారినికి తెలియ చేశామని అన్నారు. పాండవుల చెరువు నుండి నీరు క్రింద పొలాలకు పోవడానికి పైపులు అయితే ఏర్పాటు చేసి ఉన్నారు, కానీ అవసరం ఉండేటప్పుడు నీరు విడిచిపెట్టి ,అవసరం లేనప్పుడు కట్టడానికి వీలుగా గేట్లు ఏర్పాటు చేయకపోవడం వలన ,నీరు వృధాగా పోతుంది.చివరి దశలో పంట నీటి ఎద్దడికిగురయ్యే ప్రమాదం ఉన్నందున వాటిపైన శ్రద్ధ పెట్టవలసిందిగా నీటిపారుదల శాఖ వారిని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి భాస్కరరావు, వారి సిబ్బంది వరప్రసాద్, భాగ్యలక్ష్మి మరియు ఇరిగేషన్ శాఖ శివకుమార్, మైక్రో ఇరిగేషన్ శాఖ సతీష్, మార్కెటింగ్ శాఖ రాంబాబు ప్రజా ప్రతినిధులు సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరప్పారావు ,దొండ నారాయణమూర్తి కోరుకొండ వెంకటరమణ వార్డు మెంబరు బొబ్బర ఈశ్వరరావు పాల్గొన్నారు

# నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు

పిల్లల ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరి



బుచ్చయ్యపేట (శుభోదయం న్యూస్):తురకలపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ లో నేషనల్ డి వార్మింగ్ డే ని పురస్కరించుకొని స్కూల్ ప్రధానోపాధ్యాయులు మాచర్ల జాకాబ్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్సి వైద్యుల సమక్షంలో బుధవారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే సూక్ష్మజీవులు (పరాన్న జీవులు) నులి పురుగులు పిల్లలు తీసుకున్న ఆహారం నుంచి పోషకాలను గ్రహించి పిల్లలను శక్తిహీనులుగా మారుస్తాయని . దీంతో విద్యార్థులలో పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, శక్తిహీనత వంటి సమస్యలు వస్తాయని . 1-19 వయస్సు ఉన్న పిల్లలు కొందరు పౌష్టికాహార లోపంతో బాధపడుతుంటే ఇంకొందరు నులి పురుగుల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. చిన్న వయస్సులోనే పిల్లల్లో నులి పురుగులను నివారిస్తే వ్యాధి నిరోధకత పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయవచ్చు. ఈ నేపథ్యంలో జాతీయ ఆరోగ్య సంస్థ చిన్నారుల్లో ఆరోగ్యకరమైన లక్షణాలను పెంపొందించేందుకు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నదని తెలిపారు.

# పొలం పిలుస్తోంది వ్యవసాయ శాఖ- వరదయ్యపాలెం



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ):ఈరోజు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సొంతంబేడు, సంతవేలూరు గ్రామాల్లో పర్యటించి వరి సాగు నూతన యాజమాన్య పద్ధతలు గురించి



వివరించి చర్చించడం జరిగింది. వ్యవసాయ శాఖ అమలుచేస్తున్న పథకాలు గురించి వివరించడం జరిగింది, పచ్చిరొట్ట పంట జనము ను సందర్శించి ప్రాముఖ్యత ను రైతులకు తెలియజేయడం జరిగింది. పశువుల కు వర్షాకాలంలో వచ్చే వివిధ రకాల వ్యాధులు వాటి నివారణ చర్యలు గురించి చర్చించి టీకా వేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ద్వారకానాద్, విస్తరణ అధికారి ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు పవన్, గీర్వాణీ, ప్రసాద్, ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ నుండి బాలసుబ్రహ్మణ్యం, పశుసంవర్ధక అధికారి నరేష్ కుమార్ , గ్రామ రైతులు పాల్గొన్నారు

# ప్రజా ప్రగతి ట్రస్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ ఆధ్వర్యంలో..... వరదయ్యపాలెం మండలంలోని 50 మంది అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ): ప్రజా ప్రగతి ట్రస్ట్ మరియు ఐసిడిఎస్ సిడిపిఓ గారి ఆధ్వర్యంలో వరదయ్యపాలెం మండలంలోని 50 మంది అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమం రిసోర్స్ పర్సన్ గా ప్రజా ప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్లు ఏ సుబ్రహ్మణ్యం, వి చెంచురామిరెడ్డి అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం జరిగినది. ఐసిడిఎస్ సిడిపిఓ రెడ్డి దేవ కుమారి మాట్లాడుతూ అంగన్వాడి పిల్లలకు భాషాభివృద్ధి, శాస్త్రీయ పరిజ్ఞానం, అభినయ గేయాలు, ఆకారాలు, బ్రెయిన్ డెవలప్మెంట్ కి సంబంధించిన విధంగా అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇప్పించడం జరిగిందని, దీనివలన అంగన్వాడి పిల్లలు చాలా చురుగ్గా మానసిక అభివృద్ధి, శారీరిక అభివృద్ధి కలిగి ఉండడం ఆటల పాటల రూపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తర్వాత ఐసిడిఎస్ సూపర్వైజర్ అయినటువంటి జ్యోతి మేడం మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం చాలా బాగున్నదని మీరు ఇచ్చినటువంటి ఈ ప్రోత్సాహంతో మా అంగన్వాడీ వర్కర్లు పిల్లలకు నేర్పించడానికి చాలా ఉపయోగపడుతుందని %జుజజజు% పాలసీ ప్రకారం మా అంగన్వాడి సెంటర్లలో జరిగే కార్యక్రమాలకి చాలా అనుకూలంగా ఉందని ఇంత మంచి శిక్షణ కార్యక్రమం ఇచ్చినందుకు ప్రజా ప్రగతి ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. తర్వాత ఐసిడిఎస్ సూపర్వైజర్ యమునా మేడం మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం నందు పాల్గొన్న ప్రతి ఒక్క అంగనవాడి వర్కరు ఇదేవిధంగా మన అంగనవాడి సెంటర్లలో



పిల్లలకు నేర్పించాలని తెలియజేయడం జరిగినది. తర్వాత ప్రజా ప్రగతి ట్రస్ట్ మండల కోఆర్డినేటర్ ఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్వాడీలో పిల్లలందరూ ఆరోగ్యంగా భౌతిక మానసిక సామాజిక అభివృద్ధికి పునాదిగా ఉండాలని ఉద్దేశంతో శిక్షణ ఇవ్వడం జరిగిందని విద్యార్థుల్లో వారి నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అయినటువంటి %ఎ%. చెంచురామిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఆడుతూ పాడుతూ ఆరోగ్యకరంగా ఎదగడానికి అనుకూలంగా ఈ శిక్షణ కార్యక్రమం షెడ్యూలు తయారు చేయడం జరిగిందని దీనివల్ల పిల్లల్లో మానసిక భౌతిక ఎదుగుదల నైపుణ్యాలు అభివృద్ధి చెందడానికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేయడం జరిగినది. ఇంత మంచి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు అంగన్వాడి వర్కర్లు ప్రజాప్రగతి ట్రస్ట్ మరియు ఐ ఎల్ పి వారికి మరియు ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమం నందు ప్రజా ప్రగతి ట్రస్ట్ సభ్యులు జీ ఓంకార్ ఎన్ గంగయ్య డి ఈశ్వరయ్య పాల్గొనడం జరిగినది.

# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే



దోమ, (శుభోదయం న్యూస్):మండల పరిధిలోని మోత్కూరు మాజీ సర్పంచ్ కరణం నాగేశ్వర్ రావు మనమరాలి జన్మదిన వేడుకల్లో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించరు.ఈ కార్యక్రమంలో దోమ మాజీ జడ్పీటీసి నాగి రెడ్డి,పరిగి మాజీ ఎంపీపీ అరవింద్ రావు,పీఏసీఎస్ చేర్మెన్ ప్రభాకర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం,దోమ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు కె. రాజిరెడ్డి, పార్టీ అధ్యక్షులు గోపాల్ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్ రావు,నాయకులు శశిధర్ రెడ్డి,సంతోష్, మల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కావలి ట్రంక్ రోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరును పెడతాము - పార్వతమ్మకు నివాళులు అర్పించిన కావలి ఎమ్మెల్యే కావ్య



కావలి (శుభోదయం న్యూస్) : కావలి పట్టణంలోని ట్రంక్ రోడ్డుకు ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ పేరును పెడతామని, ఆవిధంగా మున్సిపాలిటీలో తీర్మానం కూడా చేయిస్తామని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కావలి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అలాగే బ్రిడ్జి సెంటర్ లో నిర్వహించిన మాగుంట పార్వతమ్మ సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ప్రజల అమ్మ మాగుంట పార్వతమ్మ మరణం రాజకీయ పార్టీలకు, కావలి పట్టణ ప్రజలకు తీరని లోటన్నారు. నిత్యం కావలి పట్టణంలో ఎవరో ఒకరితో మమేకమవుతు తన భావాలు పంచుకునేంతగా పార్వతమ్మ జీవితం కావలితో మమేకమైందని తెలిపారు. నా రాజకీయ ఆరంగేట్రం మాగుంట పార్వతమ్మ దయేనని, జలదంకి సొసైటీ అధ్యక్షుడిగా, జలదంకి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా పనిచేయడం జరిగిందన్నారు. భర్త మాగుంట సుబ్బరామరెడ్డి మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చి మెట్టినింటికి, పుట్టినింటికి వన్నెతెచ్చిన మహనీయురాలు మాగుంట పార్వతమ్మ అని కొనియాడారు. నిత్యం ప్రజా సేవకై పరితపించిన మానవతా మూర్తని అన్నారు. సామాన్య కార్యకర్త కోసం జిల్లా కలెక్టర్ నుండి ముఖ్యమంత్రి వరకు సైతం వెళ్లి పని పూర్తి చేయడం ఆమె నైజమన్నారు. ఈరోజు మనం నడిచే కావలి ట్రంకు రోడ్డు ఆ మహాతల్లి బిక్షని తెలిపారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, టిడిపి నేతలు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, నాయుడు రాంప్రసాద్, తిరివీధి ప్రసాద్, జనసేన నాయకులు సిద్దు, పొబ్బా సాయి విటల్, ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమ, విద్యార్థులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

# గాంధీ శాంతి సేవ రత్నా అవార్డుకు ఎంపికైనా డాక్టర్ ఏకుల అనంతనాగ్





పిడుగురాళ్ల, (శుభోదయం న్యూస్): పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామనికి చెందిన డాక్టర్ ఏకుల అనంతనాగ్ గత ఇరవై ఏళ్ళు గా సెన్మడ్స్ సంస్థ ద్వారా చేస్తున్న సేవలు గుర్తించి అక్టోబర్ 5న హైదరాబాద్ సెంట్రల్ హాల్ లొ జరిగే జాతి పిత మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్బంగా జాతీయ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలొ డాక్టర్ ఏకుల అనంతనాగ్ కు గాంధీ శాంతి సేవ రత్న జాతీయ అవార్డును అందిచనున్నరని హై కోర్టు న్యాయవాది మనం ఫౌండేషన్ అధ్యక్షులు కె చక్రవర్తి తెలిపారు.సెన్మడ్స్ సంస్థ వ్యవస్థాపకలు డాక్టర్ ఏకుల హుస్సేన్, వైస్ ప్రసిడెంట్ నక్క శంకర్, సెక్రటరీ వరికల్లు మేరి, ట్రజర్ బోరుగడ్డ అనురాధ, సభ్యులు గల్ల ఇంద్రజ, సూరగాని పద్మావతి, దామవరపు నాగయ్య మరియు గ్రామ పెద్దలు మిత్రులు శ్రేఅభిలాషులు డాక్టర్ ఏకుల అనంతనాగ్ కు అవార్డు పట్ల హర్షం వ్యక్తం చేసినారు.

# స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాలల సందర్శించడం చాలా సంతోషం గా ఉంది సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కందుకూరు స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలను సందర్శించడం చాలా సంతోషంగా ఉందని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ అన్నారు. పట్టణంలోని కోవూరు రోడ్డు నందు ఉన్న స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలను బుధవారం మధ్యాహ్నం ఆమె సందర్శించారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వారి యొక్క మానస్థితిని, ఆరోగ్యాన్ని గురించి పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆమె విద్యార్థులను విద్యకు సంబంధించి, మరికొన్ని కుశల ప్రశ్నను అడిగి దివ్యాంగులు ఇచ్చిన సమాధానానికి



ఆమె సంతోషించారు.పాఠశాల వంటగదిని, స్టాక్ రూమును సందర్శించి దివ్యాంగులకు ప్రతినిత్యం ఆహారాన్ని గురించి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ప్రేమతో కూడిన మంచి విద్యను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు విద్యుతోపాటు మంచి ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను సబ్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు ఆడుకునేందుకు ఆట వస్తువుల కిట్లను పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డికి అందజేశారు. విద్యార్థులకు ఆమె స్వయంగా చాక్లెట్లు పంపిణీ చేశారు.పాఠశాల వారి విజ్ఞప్తి మేరకు సబ్ కలెక్టర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు,డాక్టర్ చంద్రశేఖర్ గుప్తా,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి ప్రఖండ అన్నసాగర్ గ్రామం విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నూతన కమిటీ



ఎల్లారెడ్డి (శుభోదయం న్యూస్ ): విశ్వహిందూ పరిషత్ కామారెడ్డి జిల్లా త్రి ప్రఖండ సంఘటన మంత్రి వినోద్ కుమార్ జిల్లా గోరక్షక్ తులసి దాస్ పాల్గొన్నారు.వినోద్ కుమార్ మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం హిందూ సంస్కృతి సంప్రదాయాలు, దేవాలయాలు లవ్ జిహాద్ నుండి హిందూ అమ్మాయిలను గోమాతలను మతమార్పిడి నుండి హిందువులను హైందవ ధర్మాన్ని కాపాడెలా హిందూ సమాజాన్ని రక్షించేటట్టుగా ప్రతి ఒక్క యువత ధర్మ రక్షకులుగా పనిచేయాలని విలువైన సమయాన్ని వృధా చేయకుండా దేశం కోసం ధర్మం కోసం సమయం ఇవ్వాలని ప్రతి ఒక్క హిందువు కూడా హిందూ ధర్మాన్ని కాపాడే విధంగా ఉండాలని అందుకు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ ధల్ లో చేరాలని కోరారు. ఈ కమిటీలో అన్నసాగర్ గ్రామస్తులు వివిధ బాధ్యతలను స్వీకరించడం జరిగింది. హిందూ ధర్మం పట్ల ఎప్పుడు రక్షకులుగా ఉంటామని చెప్పడం జరిగింది.

# సెకండ్ ఎస్ఐ శంకరయ్య బాధ్యతలు స్వీకరణ...



రేగొండ, (శుభోదయం న్యూస్): రేగొండ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజా సమస్యల పరిష్కారంలో తమవంతు కృషి చేస్తానని, ఫిర్యాదుదారులు ఇచ్చిన సమాచారం మేరకు కేసులు పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని రేగొండ 2వ ఎస్సై శంకరయ్య తెలిపారు. బుధవారం రెండో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజల్లో అవగాహన కల్పించి, కేసుల పరిష్కరించే దశగా అవగాహన కల్పిస్తామన్నారు. మాదకద్రవ్యాలతో కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు.

# కామ్రేడ్ అర్జున్ రావు కు విప్లవ జోహార్లు!



గోదావరిఖని టౌన్: సెప్టెంబర్25, (శుభోదయం న్యూస్) :"గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం ఐఎఫ్టియు స్థాపకుల్లో ఒకరైన అర్జున్ రావు కుటుంబం శ్రీకాకుళం ప్రాంతం నుండి గోదావరిఖని ప్రాంతంకు వచ్చి స్థిరపడింది సింగరేణి కార్మికుడిగా జీడీకే గనుల్లో ల్యాంఫ్‌పిట్టరుగా పనిచేసేవారు 1978-81లో విప్లవ కార్మిక సంఘం ఐ ఎఫ్ టు యు స్థాపకుల్లో ఒకరిగా ఉండి యూనియన్ అభివృద్ధికి పనిచేశాడు యాజమాన్య నిరంకుశ చర్యలు పోలీస్ నిర్బంధం గుండా దాడులను ఎదుర్కొని నిలబడ్డాడు ఆయన రెండు రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లాలో తన సొంత గ్రామంలో వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో మరణించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఐఎఫ్టియు సంఘాల ఆధ్వర్యంలో అర్జున్ రావు అన్నకు నివాళు లర్పిస్తూ గోదావరిఖని ఐ ఎఫ్ టీ యు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలపడం జరిగింది.ఈ సందర్భంగా ఐ ఫ్ టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ కృష్ణాలి మాట్లాడుతూ"సింగరేణి గని కార్మికోద్యమ చరిత్రలో. తొలి విప్లవ ట్రేడ్ యూనియన్ ఐ ప్ టి యు నిర్మాణంలో తను చేసిన కృషి మరువలేనిదని, ఈ నాలుగు దశాబ్దాల కాలంలో సింగరేణి గని కార్మికుల సమస్యలపై అనేక సమరశీల పోరాటాలు గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం నిర్వహించిందని సింగరేణి గని కార్మికోద్యమంలో అనేకమంది నాయకులు గూండా దాడుల్లో పోలీస్ ఎన్కౌంటర్లలో అమరులయ్యారనీ కామ్రేడ్స్ కొదురుపాక కుమారస్వామి, ఊరకొండ రాములు, దాసరి మొండయ్య, శ్రీధర్ రాయమల్లు, కే కొమురయ్య, కంది రాజారత్నం లాంటి వాళ్లు ఈ సంఘ నిర్మాణం అభివృద్ధి కోసం తమ జీవితాలను త్యాగం చేసిన ధన్యజీవులు అని కొనియాడారు సింగరేణి గని కార్మికుల హృదయాల్లో వీరి త్యాగాలు చిరస్థాయిగా ఉంటాయి అంటూ అర్జున్ రావుకు ఆయన స్థాపించిన సంఘం నుండి ఘనంగా నివాళులర్పిస్తున్నామని వారి ఆశయాలను విప్లవ కార్మికోద్యమం ను ముందుకు తీసుకు పోదామని అంటూ సంఘం తరపున వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యు నాయకులు శాలిగామ మల్లేశ్, ఈ నరేష్, ఈదునూరి రామకృష్ణ, ఈ రాజేందర్, ఎం కొమరయ్య, జి మల్లేశం, భూషణం, ఎన్ సి బాబు,పీ మొండయ్య, స్వామి, శేఖర్, ప్రసాద్, దేవయ్య, ఐ సాంబయ్య, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ సురేష్ షెట్కార్ ను మార్కెట్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం తెలిపినా ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డి, (శుభోదయం న్యూస్): ఈ నెల 27 వ తెదినా ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మారెడ్డి రజిత వెంకట్ రాం రెడ్డి ప్రమాణ స్వీకారం ఉన్నందున బుధవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు ఎంపీ సురేష్ షెట్కార్ కి మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందచేశారు.ఎంపీని కలిసినా వారిలో ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల





సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్ రాంరెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరీఫ్,మాజీ జడ్పీటీసీ సామెల్, మాజీ సొసైటీ చెర్మన్ బోండ్ల సాయిలు,మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,గంట సాయిలు,మాజి ఎంపిటిసి షెకెవత్ అలీ, బిక్కనూర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ్ రెడ్డి, పద్మారావ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కాన్ రాజ్ ఠాగూర్, నగర మేయర్ బంగి అనిల్ కుమార్



రామగుండం, సెప్టెంబర్25,(శుభోదయం న్యూస్) : మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మేయర్ బంగి అనిల్ కుమార్ తో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు



పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకా%శీ%క్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక నిధులు కేటాయించి అనేక ప్రోత్సాహకాలు ప్రవేశ పెడుతున్నారని అన్నారు. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించడం జరుగుతుందని అన్నారు. కుటీర పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక మహిళలు , స్వశక్తి మహిళలు ముందుకువస్తే ప్రభుత్వ పథకాల ద్వారా వారు వ్యాపారంలో నిలదొక్కుకునేందుకు సహకారం అంది%శీ%చడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా స్వయం ఉపాధి పొందడానికి స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి సహకారం అందించడానికి పట్టణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఏర్పాటు చేసిన మెప్మా విభాగం కృషి చేయాలని కోరారు. తనకు కేటాయించిన డివిజన్ లో ని మహిళా సంఘాలకు ఇటీవల రూ 50 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ మంజూరు కావడానికి కృషి చేసిన సి ఎల్ ఆర్ పి కవితను అభినందించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన ఇందిరా మహిళా శక్తి విజయా రాణి క్యాంటీన్ నిర్వాహకులు పదిహేడవ డివిజన్ కు చెందిన సంతోషి మాత స్లమ్ లెవెల్ ఫెడరేషన్ సభ్యులు సుహాసిని , దీపిక , రాధలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని స్వయం ఉపాధి పొందడానికి యూనిట్ల స్థాపనకై మహిళలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్ , నాయకులు పాతపెల్లి ఎల్లయ్య , పెద్దెల్లి ప్రకాష్ , నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు , ఇ ఇ రామన్ , డి ఇ లు జమీల్ , హన్మంతు నాయక్ , ఆర్ ఐ శంకర్ రావు , మెప్మా టి ఎం సి ఊర్మిళ , సి ఓ లు శ్వేత , స్వరూప , స్వప్న , సి ఎల్ . ఆర్ . పి కవిత , నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## బాన్స్ వాడ పట్టణ సిఐగా మండలి అశోక్ బాధ్యతలు

బాన్సువాడ, (శుభోదయం న్యూస్ ): బాన్సువాడ పట్టణ సిఐగా మండలి అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మున్నూరు కృష్ణ డిజిపి కార్యాలయంకు అటాచ్ చేశారు. నిర్మల్ ఎస్ బి కార్యాలయంలో పనిచేస్తున్న మండలి అశోక్ బాన్సువాడ పట్టణ సీఐగా వచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ స్టేషన్ న్యాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూస్తానని సిఐ అశోక్ భరోసా కల్పించారు. రాజకీయాలకు అతీతంగా తాను విధులు నిర్వహిస్తానని వెల్లడించారు.

## కొత్త సినిమా వచ్చిందంటే పండగే.. పండుగ...

### ప్రేక్షకులను నిలువునా దోచుకుంటున్న.. యజమాన్యం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, సెప్టెంబర్..25, (శుభోదయం న్యూస్ ): ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం పట్టణంలో గల సినిమా థియేటర్లు కనీస నిబంధనలు పాటించడం లేదని మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి. షేక్ అజీమ్ భద్రాచలం ఆర్డీవో గారికి ఈరోజు బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొత్త సినిమా (రిలీజ్ ) భద్రాచలం వచ్చిందంటే. సినిమా యజమానులకు పండగే.. పండగని. ప్రేక్షకుల. అభిమానుల. సంతోషాన్ని ఆనందాన్ని అలుసుగా తీసుకొని అధిక రేట్లకు టిక్కెట్లను ఆన్లైన్ ద్వారా విక్రయిస్తున్నారని . అజీమ్ ఫిర్యాదులో వివరించారు.. భద్రాచలం చుట్టుపక్కన గల అన్ని పల్లె గ్రామాల నుంచి అభిమానులు ప్రేక్షకులు కొత్త సినిమా కి తరలిరావడం తో. ఇది అదునుగా భావించిన సినిమా యజమాన్యాలు. ఒక్కో టిక్కెట్ పై 200 రూపాయల నుండి 500 రూపాయల వరకు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఇలాంటి థియేటర్లపై కనీసం తనిఖీ చేసి అధికారులు కరువయ్యారని అజీమ్ ఫిర్యాదులో వివరించారు ప్రేక్షకుల వాహనాలను పార్కింగ్ చేసే స్థలం కూడా సక్రమంగా లేదని సౌకర్యంగా లేదని అయినప్పటికీ. సాధారణ చార్జీల కన్నా అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని. ప్రేక్షకుల విశ్రాంతి (విరామ) సమయంలో. తాగే వాటర్ బాటిల్ కూల్ డ్రింక్స్ రెట్టింపు విక్రయిస్తున్నారని అలాగే తినుబండార విషయములు రేట్లు విపరీతంగా పెంచి అమ్ముతున్నారని అజీమ్ ఫిర్యాదులోవివరించారు. ప్రేక్షకుల అభిమానుల సంతోషాన్ని ఆసరాగా తీసుకొని థియేటర్లో యజమానులు కొత్త సినిమా వచ్చినప్పు డల్ల. ఇదే అదునుగా భావించి నిలువునా దోచుకుంటున్నారని అజీం పేర్కొన్నారు. అధిక రేట్లపై ప్రేక్షకులు అభిమానులు సినిమా థియేటర్ల యజమానులను ప్రశ్నించగా మీ ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే ఊరుకోండి అని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం పట్టణంలో గల థియేటర్ల యజమానులు మరియు డిస్ట్రిబ్యూటర్లు ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి ఇష్టనుసారంగా వ్యవహరిస్తూ సినిమా అభిమానులను విరోధానికి దూరం చేస్తూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ న్న. థియేటర్లపై చర్యలు తీసుకోవాలని. ఆన్లైన్ బుకింగ్ విక్రయాలను వెంటనే నిలిపివేసి పాత పద్ధతిలోనే టికెట్లను విక్రయించాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు ఇలాంటి సంఘటన మరల పునరావృతం అయితే థియేటర్ల ముందు ఆందోళన చేపట్టవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు సంబంధించిన అధికారులు నిద్రమత్తు వీడి థియేటర్లను పర్యవేక్షించి తనిఖీలు నిర్వహించాలని అజీమ్ డిమాండ్ చేశారు.

## భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో పండిత్ దిన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి



పటాన్చెరు (శుభోదయం న్యూస్) : భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది గోదావరి అంజి రెడ్డి మాట్లాడుతూ పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సాధారణ జీవనం గడిపారని ఉన్నత ఆలోచన మరియు దృఢ సంకల్పం కలిగిన వ్యక్తి అని రచయిత, పాత్రికేయుడు, ఆలోచనాపరుడు, తత్వవేత్త, నిజమైన జాతీయవాది మరియు మానవతావాదిఅని పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను మనమందరం ముందుకు తీసుకెళ్లాలన్నారు అట్టడుగు ప్రజల కోసం అనునిత్యం పోరాటం చేశారని ఆర్ఎస్ఎస్ లో పూర్తి సమయ కార్యకర్తగా పనిచేశారని భారతీయ జనతా పార్టీ పునాది పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ దయాల్ గారిని కుట్ర పూరితంగా హత్య చేయడం జరిగిందని ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్ ప్రధాన కార్యదర్శి మీనా గౌడ్ గోపాల్ లక్ష్మణ్ గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ 37వ పోలింగ్ బూత్ అధ్యక్షులు ఏర్పుల వీరేశ్ ఆధ్వర్యంలో పండిత్ దిన్ దయల్ ఉపాధ్యాయ జయంతి



పటాన్చెరు (శుభోదయం న్యూస్) : పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అతను నమ్ముకున్న ఏకాత్మత మానవతా సిద్ధాంతం అంత్యోదయ పథకాలను దేశంలోని చిట్టచివరి మనిషి వరకు కూడా అందేటట్లు చూడాలని వారి కోరిక అదే సిద్ధాంతం తోనే భారతీయ జనతా పార్టీ కొనసాగుతుంది ఏర్పుల వీరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రతాపరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వి రాజిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దోమడు రమేష్, మండల ఉపాధ్యక్షులు పూడూరి సుధాకర్, తొర్రి అశోక్, కాషా అంజి, కుమ్మరి కృష్ణ, మ్యాదరి యాదగిరి, మున్ని రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ పారిశుధ్ధ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం



గోదావరిఖని టౌన్: సెప్టెంబర్25, (శుభోదయం న్యూస్) స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా వ్యక్తి గత రక్షణ పరికరాలను ఉపయోగించుకోవడంపై నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మంది రంలో బుధ వారం



నిర్వహించిన కార్యక్రమంలో వ్యక్తి గత రక్షణ పరికరాల ఆవశ్యకత , వాటిని వాడడంలో నిర్లక్ష్యం వహిస్తే సంక్రమించే వ్యాధుల గురించి కామ్ ఫౌండేషన్ ప్రతినిధులు నగర పాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు , కామ్ ఫౌండేషన్ ప్రతినిధి చిన్ని కృష్ణ , సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్ , హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మరియు సీన్తో క్వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం



హైదరాబాద్, (శుభోదయం న్యూస్): ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్.వి. పవన్ కుమార్ మరియు సీన్తో క్వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య సాంకేతిక అధికారి శ్రీ పి.వి.ఎన్. రాఘువేంద్ర మధ్య కీలకమైన ఒప్పందం పై సంతకం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం విద్యా రంగం మరియు పరిశ్రమ మధ్య భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే కాకుండా విద్యార్థులకు పరిశోధన అవకాశాలు, ఇంటర్న్షిప్‌లు మరియు పరిశ్రమలో ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడం లక్ష్యం. ఈ భాగస్వామ్యం ద్వారా ఇరు సంస్థలు సాంకేతికత మరియు శాస్త్రరంగాల్లో నవకల్పన, పరిశోధన మరియు నైపుణ్యాభివృద్ధి ను ముందుకు తీసుకెళ్ళనున్నాయి. ఈ సందర్భంలో, డాక్టర్ ఎస్.వి. పావన్ కుమార్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు వాస్తవ ప్రపంచ అన్వయాలపై పరిచయం లభిస్తుందని ఉద్ఘాటించారు. శ్రీ పి.వి.ఎన్. రాఘువేంద్ర భవిష్యత్తు సాంకేతిక పురోగతులను ముందుకు తీసుకువెళ్ళేందుకు ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. ఈ ఒప్పందం భారతదేశంలోని సాంకేతిక రంగం ఎదుగుదలకు ప్రోత్సాహకరంగా మారుతూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతులైన ప్రొఫెషనల్స్ ను తయారుచేయడం ప్రధాన లక్ష్యంగా ఉంచుకున్నది.

## ఆర్గానిక్ వ్యవసాయంతో ఎంతో మేలు : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్...



దోమ, (శుభోదయం న్యూస్ ):రైతులు వాణిజ్య పంటలతో పాటుగా అంతర పంటగా చిరుధాన్యాలను పండించడానికి మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు. బుధవారం పరిగి నియోజకవర్గ దోమ మండల పరిధిలోని దోర్నాలపల్లి, బాస్ పల్లి గ్రామాల్లో పర్యటించారు. వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్గానిక్ పద్ధతిలో చిరుధాన్యాల పెంపకం చేపడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు వాణిజ్య పంటలతో పాటుగా చిరుధాన్యాలను కూడా పండించాలని అన్నారు. చిరుధాన్యాలను పండించడం ద్వారా లాభదాయకమైన ఆదాయం లభిస్తుందని అన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తిని సాధించవచ్చని అన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో పండించే ఆహార ధాన్యాలు, కూరగాయల ద్వారా మానవ జీవన ప్రామాణిక స్థాయి మెరుగుపడుతుందని అన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా పండించే పంటలకు స్టాల్స్ ఏర్పాటు చేసి అందరికీ ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను అందే విధంగా కృషి చేయాలని సూచించారు. వాసన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం దోర్నాల పల్లి ,బాస్పల్లి గ్రామాల్లో పాఠశాలల్లో మొక్కలు నాటారు. బాస్పల్లి గ్రామాల్లో పాఠశాలలో వంట గదిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ తో గ్రామస్తులు బ్యాంకులో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని,బ్యాంకును సందర్శించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేష్ బాబు, ఏఓ ప్రభాకర్ రావు, ఎంపీఓ సోమలింగం,నాయకులు యాదయ్య సాగర్,అనంతయ్య, వాసన్ సంస్థ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసిన ఎస్సై అంకమ్మ



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):అక్రమ మద్యము కలిగి ఉన్నటువంటి పచ్చిపాల వినోద్ మోచర్ల గ్రామం మరియు అడపాల మనోజ్ కుమార్ కావలి మండలం ముసునూరు గ్రామం వారు ఉలవపాడు మండలంలోని చాకిచెర్ల గ్రామము హై స్కూల్ వద్ద మధ్యము అమ్ముటకు ప్రయత్నం చేస్తుండగా వారిని ఉలవపాడు ఎస్సై అదుపులోనికి తీసుకొని వారి దగ్గర ఉన్నటువంటి సుమారు 93 బాటిల్ల మధ్యమును స్వాధీనం చేసుకొని అరెస్టు చేయడం జరిగిందని. అది గోవా నుండి తెప్పించినటువంటి అక్రమ మద్యముగా గుర్తించిచా గోవా నుండి తీసుకొని వచ్చి ఇక్కడ లోకల్ గా అమ్ముటకు వినోదు మరియు మనోజులకు ఇచ్చినటువంటి నెల్లూరు కి చెందిన బుజ్జి అలియాస్ అబ్దుల్ అజీజ్ అనేటువంటి వ్యక్తిని అరెస్టు చేయవలసి ఉంది. బుధవారం అరెస్టు చేసినటువంటి ఇద్దరు ముద్దాయిలను కోర్టులో హాజరుపరచగా జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారు ముద్దాయిలకు వచ్చేనెల 7వ తారీకు వరకు రిమాండ్ విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## పరిమళించిన మానవత్వం ఆ నలుగురు పాత్రలో యాడికి మే ఐ హెల్ప్ య & వేడుకాపుర ఫౌండేషన్ సభ్యులు



యాడికి (శుభోదయం న్యూస్) : మండల కేంద్రంలోని తిప్పారెడ్డి పల్లె రోడ్డులో నివసిస్తున్న నేతి బొట్టు కుళ్లాయమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించడం జరిగింది. మృతురాలికి భర్త పిల్లలు ఎవరూ లేకపోవడంతో ఆమె అన్నలు యాడికి ఫౌండేషన్ మరియు వేడుకాపుర ఫౌండేషన్ ని సంప్రదించడం జరిగింది. బంధువులు ఎవరు అంత్యక్రియలను చేయడానికి సుముఖంగా లేకపోవడంతో ఫౌండేషన్ తరపున సభ్యులు వెళ్లి నేతిబొట్టు కుళ్లాయమ్మ అంత్యక్రియలను పూర్తి చేయడం జరిగింది. ఫౌండేషన్ వారు చేస్తున్న సేవలను గుర్తించి మేము కూడా మీతో నడుస్తామని ఇద్దరు కొత్త సభ్యులు పాడే మోయడానికి ఫౌండేషన్ వారితో కలిసి నడిచారు. అయినవాళ్లు ఎవరూ లేని వారికి ఆ నలుగురు తోడై అంత్యక్రియలు పూర్తిచేయడం వల్ల మీరు ఎంతో పుణ్యం మూట కట్టుకుంటున్నారని నేతిబొట్టు కుళ్లాయమ్మ బంధువులు ఫౌండేషన్ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సెక్రటరీ ఆలూరు చంద్రశేఖర్,రెడ్డి ,ధ్రువ నారాయణ




,బడిగించల వేణు,పి.రామాంజనేయులు,గాంధీజీ స్కూల్ రామ మోహన్,పల్లా ఆంజనేయులు,జొన్నల వెంకటేష్, టి లక్ష్మీకాంతమ్మ , పోలిశెట్టి రామాంజనేయులు,నేతి బొట్టు రంగనాయకులు పాల్గొనడం జరిగింది.

## నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయండి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: గృహనిర్మాణశాఖపై సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని సూచించారు. బీసీ కులగణన కోసం వెంటనే కార్యచరణ ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులకు ముఖ్యమంత్రి తెలిపారు. బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు సచివాలయంలో సీఎంను కలిశారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి విధానాలపై ముఖ్యమంత్రితో కమిషన్ ఛైర్మన్, సభ్యులు చర్చించారు. బీసీ కులగణన ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి విధానాలను పరిశీలించాలని సీఎం తెలిపారు. బీసీ కులగణన వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని సీఎం హామి ఇచ్చారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రుల అరాచకాలను ఎండగడదాం : కేటిఆర్



అడ్డగూడూర్, (శుభోదయం న్యూస్) : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మంత్రుల అరాచకాలను ఎండగడతామని కేటీఆర్ అన్నారు. అధికార అహంకారంతో ఈ జిల్లా మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. వారి అవినీతి ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ చేపట్టనున్న అంశాలు, కార్యక్రమాలను పార్టీ నేతలకు కేటీఆర్ వివరించారు. జిల్లాలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

### మళ్లీ ఫ్లోరోసిస్ భూతం...


కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్గొండ జిల్లాలో మళ్లీ ఫ్లోరోసిస్ భూతం తెరపైకి వస్తోందని కేటీఆర్ కు జిల్లా పార్టీ నేతలు వివరించారు. అదే విధంగా కాంగ్రెస్ నేతల అరాచకాలు అవినీతి కి అడ్డు అదుపు లేకుండా పోయిందని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏ విధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది నియోజకవర్గాల వారీగా కేటీఆర్ కు వివరించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్ని అంశాల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో వారిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని కేటీఆర్ కు చెప్పారు.



### స్థానిక సమస్యలపై పోరాడుదాం

రాష్ట్ర రాజకీయాలతో పాటు నల్గొండ జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాల పైన కూడా మరింత చురుగ్గా ప్రజాక్షేత్రంలో వెళ్దామని స్థానిక జిల్లా నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో లేవనెత్తాల్సిన సమస్యలను వారికి వివరించారు. అదే విధంగా పార్టీని మరింత బలోపేతం చేయటంతో పాటు, కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను ఈ సమావేశంలో చర్చించారు. త్వరలోనే నల్గొండ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తో పాటు ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్, గొంగిడి సునీతా రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, రమావత్ రవీంద్ర కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, బూడిద బిక్షమయ్య గౌడ్, మాజీ జెడ్పీచైర్మన్లు బండా నరేందర్ రెడ్డి, ఎలినినేటి సందీప్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ భరత్ కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహరెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి మరియు పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# జనజాగృతి, అంగన్వాడి, పశు వైద్య స్టాల్స్ తిలకించిన ఎమ్మెల్యే




తనకల్లు, ( శుభోదయం న్యూస్): మండల పరిధిలోని బాలసముద్రం పంచాయతీలోని శివాలయం గుడి దగ్గర ఏర్పాటు చేసినటువంటి ఇది మన ప్రభుత్వం అనే కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ బుధవారం పాల్గొన్నారు. అంగన్వాడి సిబ్బంది, జన జాగృతి సంస్థ ఏర్పాటు చేసినటువంటి ప్రకృతి వ్యవసాయం గురించి స్టాల్స్, అదేవిధంగా పశువైద్య సిబ్బంది ఏర్పాటు చేసినటువంటి ఇష్టాలను ప్రత్యేకంగా ఎమ్మెల్యే అక్కడ ఏర్పాటు చేసినటువంటి కూరగాయలు పండ్లు ఆకుకూరలును ప్రకృతి వ్యవసాయం పండించిన చిరుధాన్యాలను, పశువులకు సంబంధించిన మందులను, అక్కడున్న అధికారులు అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ::- సంక్షోభంలోనూ కూడా సంక్షేమాన్ని రాష్ట్రానికి అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ను స్ఫూర్తిదాయకంగా తీసుకొని మండల అధికారులు ప్రజల కష్టాలను గుర్తించి నాయకులు ద్వారా గాని ప్రజలు నేరుగా గాని మండల ఆఫీసులు చుట్టూ తిరగకుండా సకాలంలో పనులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజలకు జవాబుదారీ ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంది అని, అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వారి పనులను నెరవేర్చాలని, అంతేకాకుండా ప్రజల కోసం, ఈ నియోజకవర్గంలోగత 20 సంవత్సరాల నుంచి కూడాసేవ చేస్తున్నానని,



భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉంటానని, అన్ని గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు, స్మశానవాటికలను, త్వరతగతిన పూర్తి చేయాలని మండల అధికారులకు ఆదేశించారు, అదేవిధంగా బాలసముద్రం పంచాయతీలో గత కొద్ది రోజుల నుండి రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలవడంతో పోకులకు ఇబ్బందికరంగా ఉంటుందని, తన దృష్టికి వచ్చిందని, సమస్య కూడా పరిష్కరిస్తామని, అదేవిధంగా మండలంలో ఎక్కువగా తండాలలు ఉన్నాయని వారి ప్రాంతాలను గుర్తించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు విన్నవించారు, రాబోయే అతి తక్కువ కాలంలోనే దసరా పండుగను పురస్కరించుకుని మహిళలుకు ఇచ్చిన హామీలు అమలులో భాగంగా ప్రతి కుటుంబానికి దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని, అదే కాకుండా కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరు చేస్తామని ప్రజలు ఎవరు కూడా అధైర్యపడకండి అని ప్రజలకు భరోసా కల్పించారు. మొదటి విడతలో భాగంగా ఇచ్చిన మాట కట్టుబడి పెన్షన్ దారులకు 3000 రూపాయలు నుండి 4000 రూపాయలను ఒకటో తారీఖున అందించడం జరుగుతుందని, పెన్షన్ పంపిణీ ఆనాటి కాలంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రవేశ పెట్టడం జరిగిందని, ఈ ప్రభుత్వం ఎప్పుడు పేదల పక్షాన నిలబడతాదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, మండల అధికారులు తహసిల్దార్ శోభా సువర్ణమ్మ, ఎంపీడీవో వెంకటరమణ,మండల స్పెషల్ ఆఫీసర్ డిఎల్ డివో సూర్యనారాయణ, అగ్రికల్చర్ ఏ డి సత్యనారాయణ, ఏవో శ్రీహరినాయక్ వెలుగు ఏపీఎం వెంకట నారాయణ,వివోఆర్డి కృష్ణమూర్తిరెడ్డి,అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మిదేవమ్మ, మరియు సిబ్బంది, పశు వైద్య అధికారి హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ నాయకులు:- మండల కన్వీనర్ తొట్లి రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు, సీనియర్ నాయకుడు బడా రాజారెడ్డి,కోటిరెడ్డి, పీజీ మల్లికార్జున, శ్రీధర్ రెడ్డి,సోంపాళ్యం నాగభూషణ, మాజీ సర్పంచ్ గోవిందు,అరికాయల రవి, వాల్మీకి అశోక్,తెలుగు యువత మండల అధ్యక్షులు కావిడి ప్రవీణ్ కుమార్, జనసేన మండల అధ్యక్షులు కేవి రమణ నియోజకవర్గం జనసేన నాయకుడు కొట్టి అశ్వర్త కుమార్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్ రెడ్డి, మాబషా,ఎస్సి సెల్ చినప్ప, డెగాని శంకర్ నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్టుల వాటా కోసం కృషి చేద్దాం


దళిత జర్నలిస్టుల చైతన్య సభకు హాజరుకావాలని, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మల్లెపల్లి లక్ష్మయ్య, ఆదం విజయ్ కుమార్ లకు ఆహ్వానం .



హైదరాబాద్ (శుభోదయం న్యూస్) : దళిత జర్నలిస్టుల హక్కుల కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రాజు అన్నారు. సెప్టెంబర్ 27న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగే దళిత జర్నలిస్టుల చైతన్య సభను విజయవంతం చేయాలని, ఫోరం నేతలు పేర్కొన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బుద్ధవనం ప్రాజెక్టు మాజీ స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి



లక్ష్మయ్య, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు వీరహత్ హలీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం విజయ్ కుమార్ ల్ను కలిసి, దళిత జర్నలిస్టుల చైతన్య సభకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బండారు రాజు మాట్లాడుతూ... దళిత జర్నలిస్టులకు సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, దళిత జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ లను



కేటాయించాలని, అలాగే అక్రిడేషన్ కమిటీలో దళిత జర్నలిస్టుల ఫోరం సభ్యులను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మీసాల ఎల్లేష్, గ్రేటర్ గౌరవ అధ్యక్షులు బాబురావు, కార్యదర్శి సాగర్, కార్యవర్గ సభ్యులు రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారిగా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన చెన్నూరి రాంబాబు



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయము నందు మోటారు వాహనముల తనిఖీ అధికారి గా పనిచేస్తున్న ఎస్ కే యండి రఫీ నెల్లూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంనకు బదిలీ అయ్యారు. కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారిగా నెల్లూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయం నందు ఎన్ఫోర్స్మెంట్ ఏం వి ఐ గా పనిచేస్తూ ఉన్న చెన్నూరి రాంబాబు ఇన్చార్జి ఇన్స్పెక్టర్ గా బుధవారం బాధ్యతలను చేపట్టడం జరిగినదని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖా అధికారి టి.వి. నాగ లక్ష్మీ తెలియచేశారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్‌కు వైద్యుల విజ్ఞప్తి




ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో ఉన్న వైద్యులకు పీజీలో ఇన్ సర్వీస్ కోటాకు సంబంధించి జీవో 85 తమకు రావాల్సిన సీట్లను దూరం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞాపన పత్రం అందచేశారు. బుధవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం దగ్గర అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. గతంలో మూడేళ్ళ సర్వీస్ ఉంటే సీటుకు అర్హత ఇచ్చేవారని, ఇప్పుడు అయిదేళ్లు చేయడమే కాకుండా, ఇన్ సర్వీస్ కోటాలో సీట్లు శాతాన్ని కూడా తగ్గించారని వివరించారు. వీరు ప్రస్తావించిన అంశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో జిల్లా స్థాయికి ఎంపికైన శ్రీ శారద హై స్కూల్ విద్యార్థులు



తనకల్లు, (శుభోదయం న్యూస్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో శ్రీ శారద విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కు చెందిన శ్రీకాంత్ మనోజ్ రెడ్డి ,జి .సాయి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నియోజకవర్గ పోటీలలో కురుమలకోట హైస్కూల్లో నిర్వహించిన క్రీడా పోటీలలో వీరు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. చిత్తూరులో జరిగే జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారు. పాఠశాల కరస్పాండెంట్ సనత్ కుమార్ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణం



అని కొనియాడారు. మా విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలలో కూడా ముందున్నారని గత సంవత్సరం పదవ తరగతి లో 982 మార్కులతో మండల టాపర్ గా తమ పాఠశాల నిలిచిందని గుర్తు చేశారు . పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నజీర్ మాట్లాడుతూ మా విద్యార్థులు మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి, నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపిక కావడం నాకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఎంపికైన విద్యార్థులకు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సిద్ధారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.

## లెబనాన్‌పై మరోసారి ఇజ్రాయెల్ మెరుపు దాడి.. 51 మంది దుర్మరణం..!



లెబనాన్‌పై ఇజ్రాయెల్ వరుస దాడులకు పాల్పతున్నది. దాడుల్లో ఇప్పటికే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా బుధవారం మరోసారి ఇజ్రాయెల్ దాడులకు దిగింది. ఈ దాడుల్లో 51 మంది మరణించగా.. 223 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి తెలిపారు. గత రెండు రోజుల్లో దాదాపు 150 మంది మహిళలు, పిల్లలతో సహా 564 మంది దుర్మరణం చెందారు. 1800 మందికిపైగా గాయపడ్డారు. 2006లో ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య నెల రోజుల పాటు జరిగిన యుద్ధం తర్వాత లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుపడుతున్నది. ఇజ్రాయెల్ సైన్యం దాడులతో దక్షిణ లెబనాన్‌లో జనం తలదాచుకునేందుకు ఇబ్బందులుపడుతున్నారు. దాదాపు 90వేల మంది నిరాశ్రయులయ్యారు. ఇవాళ



లెబనాన్ నుంచి టెల్ అవీవ్ వైపుగా ప్రయోగించిన మిస్సైల్‌ను అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. హిజ్బుల్లా తొలిసారిగా ఇజ్రాయెల్ ఆర్థిక కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకొని దాడికి పాల్పడింది. అయితే, హిజ్బుల్లా ప్రయోగించిన మిస్సైల్‌ని ఐరన్ డోమ్ నింగిలోనే పేల్చేసింది. బీర్‌లో మంగళవారం ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో సీనియర్ హిజ్బుల్లా కమాండ్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు దేశాల మధ్య అనధికారిక యుద్ధం సాగుతున్నది. మరో వైపు ఇవాళ రాత్రి యూఎన్ భద్రతా మండలి సమావేశం కానున్నట్లు సమాచారం. ఓ కార్యక్రమంలో అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ఇరుపక్షాల దౌత్యపరంగా ఒప్పందం చేసుకోవాలని సూచించారు.

## రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదు



**హైదరాబాద్, :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్పంచులు, గ్రామ పంచాయతీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తుందని రేవంత్ రెడ్డీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మాట్లాడారు.. బిల్లులు రాక 60 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని అప్పుడు రేవంత్ అన్నారు.. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదు అని ఆయన మండిపడ్డారు. సర్పంచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఆయనని పలకరించిన నాథుడే లేడు.. అడ్డదారులు తొక్కి అధికారంలోకి రేవంత్ రెడ్డి వచ్చారు.. సర్పంచుల పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. దసరాలోపు పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని ఈటల రాజేందర్ అన్నారు. లేకుంటే మిమ్మల్ని ఎక్కడికి అక్కడ అడ్డుకునేందుకు సర్పంచులు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. సర్పంచుల ఆందోళనకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తాం.. సర్పంచ్ ల పదవి కాలం పూర్తయ్యి ఏడు నెలలు దాటినా ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదు అని ప్రశ్నించారు. పాలక మండలి లేక గ్రామాల్లో చెత్త పేరుకుపోతుంది.. రేవంత్ గ్రామాలను వల్లకాడుగా మార్చారు.. వెంటనే రిజర్వేషన్లు ప్రకటించి సర్పంచు ఎన్నికలు జరపాలి అని కోరారు.

## కడప వైసీపీలో కలవరం..! కూటమి వైపు కార్పొరేటర్ల క్యూ..



**అమరావతి,:** వైసీపీ కంచుకోటలో పాగా వేసేందుకు కూటమి నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట. అసంతృప్తిగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లను కూటమిలోకి రావడానికి ద్వారాలు తెరిచారట. అయితే, కడప కార్పొరేషన్.. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ నుంచి నేటి వరకు వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 2006లో కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ అయింది. దీనికోసం కడప పట్టణానికి సమీపంలో ఉన్న పలు గ్రామాలను మెర్జ్ చేశారు. దీంతో కమలాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాలు.. కడప కార్పొరేషన్ లో విలీనం అయ్యాయి. ఆనాటి నుండి కడప ఎమ్మెల్యే తో పాటు కమలాపురం ఎమ్మెల్యేకి సంబంధించిన నేతలు కార్పొరేటర్లుగా గెలుపొందుతూ వస్తున్నారు. ప్రధానంగా కడప అసెంబ్లీ మొత్తం కార్పొరేషన్ పరిధిలోనే ఉంటుంది. కడప ఎమ్మెల్యే ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న కార్పొరేషన్ రెజల్యూషన్ తప్పనిసరి. 2004 నుంచి ఇప్పటివరకు కడప అసెంబ్లీలో టీడీపీ అభ్యర్థులు గెలిచిన దాఖలాలు లేవు. 20 సంవత్సరాలు తర్వాత మొదటిసారిగా కడప, కమలాపురం రెండు నియోజకవర్గాలలో టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతేకాకుండా రాష్ట్రంలో కూడా టీడీపీ అధికారం చేపట్టడంతో ఆ ఇద్దరు ఎమ్మెల్యేల దృష్టి కడప కార్పొరేషన్ పై పడిందట. గత 20 సంవత్సరాలుగా వైసీపీ కంచుకోటగా ఉన్న కడప కార్పొరేషన్ పై తమ ఆధిపత్యం చెలాయించడం కోసం వైసీపీ కార్పొరేటర్లు కూటమిలోకి రావడానికి ఆ ఇద్దరు నేతలు ద్వారా తెరిచారట. కడప కార్పొరేషన్ లో 50 డివిజన్లు ఉన్నాయి. వాటిలో ఒక్క డివిజన్‌లో మాత్రమే టీడీపీ కార్పొరేటర్.. మిగతా 49 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు గెలుపొందారు. కరోనాకాలంలో ఒక్క కార్పొరేటర్ మృతి చెందారు. మేయర్ తో సహా 48 మంది కార్పొరేటర్లు వైసీపీకి చెందిన వారే. కడప ఎమ్మెల్యేగా మాధవి గెలిచిన అనంతరం రెండుసార్లు కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. తన మార్కు సాధించడం కోసం ఆమె కార్పొరేటర్ లను టీడీపీలోకి రావడం కోసం పావులు కదుపుతోందట%ॐ% వైసీపీలో అసంతృప్తిగా ఉన్న కార్పొరేటర్ లను తమ వైపు తిప్పుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట.. అందులో భాగంగా 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ.. వైసీపీని వీడి టీడీపీలో చేరారట. మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరుతున్నారంటూ ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి కూడా తన నియోజకవర్గం లోని ఐదు మంది కార్పొరేటర్లతో మంతనాలు జరుపుతున్నారట.. వీరు కూడా త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా మరో 6 మంది కార్పొరేటర్లు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారట. టీడీపీలోకి వారికి అనుమతి లేకపోవడంతో.. బీజేపీ పంచన చేరడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారట. బీజేపీ పెద్దలు కూడా కడప అసెంబ్లీలో పార్టీని బలోపేతం చేయడానికి కార్పొరేటర్ల చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. మరి కొంతమంది కార్పొరేటర్లు జనసేన నేతలతో మంతనాలు జరుపుతున్నారట. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తాము కూటమిలో చేరితే పనులు చక్కబెట్టుకోవచ్చని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారట. గత 20 సంవత్సరాలుగా వైసీపీలో ఉన్న కార్పొరేటర్లు నేడు పార్టీని వీడుతున్నవారిని అడ్డుకోవడంలో వైసీపీ అధిష్టానం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి.. ఏది ఏమైనా కడప కార్పొరేషన్ పై పట్టు సాధించడం కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు ముమ్మురంగా ప్రయత్నం చేస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు

## ఈ ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధి చెబుతారు



ఇంటర్నెట్ డెస్క్: సాగు చట్టాలపై భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై సొంత పార్టీ నుంచి కూడా వ్యతిరేకత రావడంతో ఆమె క్షమాపణలు చెప్పారు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. భాజపా రైతు వ్యతిరేక విధానాలు మరోసారి బయటపడ్డాయని దుయ్యబట్టారు. "750 మంది రైతులు బలైన తర్వాత కూడా.. ఈ రైతు వ్యతిరేక భాజపా పార్టీ, మోదీ ప్రభుత్వం తమ ఘోర తప్పిదాన్ని ఇప్పటికీ గుర్తించట్లేదు. మూడు రైతు వ్యతిరేక సాగు చట్టాల అమలు చేయడంపై ఇంకా చర్చిస్తోంది. నిరసన సమయంలో అన్నదాతలపై మోదీ ప్రభుత్వం చేసిన అరాచకాలను 62 కోట్ల మంది రైతులు ఇంకా మరచిపోలేదు. రైతులపై అవమానకర వ్యాఖ్యలకు ఈసారి హరియాణా సహ ఎన్నికలు నిర్వహించే రాష్ట్రాల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారు" అని మల్లికార్జున ఖర్గే జోస్యం చెప్పారు. మోదీ చేసిన ప్రకటనల కారణంగా ఆయన మంత్రులు, ఎంపీలకు రైతులను అవమానించడం అలవాటుగా మారిందని ఆరోపించారు. అన్నదాతలకు ఇచ్చిన మూడు వాగ్దానాలను మోదీ ప్రభుత్వం ఉల్లంఘించిందని మండిపడ్డారు. రైతుల ఉపశమనం కల్పించడం మాని.. వారిని అవమానిస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. ఆ పార్టీలో రైతుల పట్ల ఎంత వ్యతిరేకత ఉందో ఇప్పుడు యావత్ దేశానికి మరోసారి అర్థమైందన్నారు. 'రద్దు చేసిన మూడు సాగు చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకురావాలని, రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండే ఆ చట్టాలను మళ్లీ అమలు చేయాలని, ఆ చట్టాల కోసం రైతులే డిమాండ్ చేయాలి' అని కంగనా మంగళవారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని భాజపా వెల్లడించింది. ఈ క్రమంలోనే కంగన క్షమాపణలు చెబుతూ వీడియో పోస్ట్ చేశారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన కొడాలి నాని, వల్లభనేని వంశీ




**అమరావతి,:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని పలువురు కీలక నేతలు కలిశారు. వైఎస్ జగన్ ను కలిసిన నేతలలో కొడాలి నాని, వల్లభనేని వంశీ తదితరులు ఉన్నారు. వైఎస్సార్సీపీలో సంస్థాగత మార్పులు జరుగుతూ ఉండడంతో, రాజకీయ పరిణామాలను చర్చించడంతో పాటు జిల్లాల అధ్యక్షుల ఎంపిక కోసం పార్టీ నేత వైఎస్ జగన్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నేతలతో తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో జగన్ భేటీ అయ్యారు. ఆయా జిల్లాల కొత్త అధ్యక్షుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. నాని, వంశీలతో పాటు జగన్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి పేర్ని నాని, ఉప్పాల రాము, హారిక తదితరులు ఉన్నారు.

# అడవి ఆర్తనాదం



పచ్చని పైరుని తలపించే స్వచ్ఛమైన వికారాబాద్ అడవి ఆపదలో పడింది. ఆదుకోమంటూ ఆర్తనాదం చేస్తోంది. మూడు వేల ఎకరాల దామగుండం రిజర్వు ఫారెస్టులో 900 ఎకరాల భూమిని కేంద్ర నేవీ నిర్మించే రాడార్ కేంద్రం కోసం గత ప్రభుత్వాలు కేటాయించాయి. దీని కోసం 12 లక్షల పచ్చని చెట్లను నరికేసేందుకు నేవీ వారు సిద్ధమయ్యారు. సహజసిద్ధ అడవిని నరికేసి పర్యావరణాన్ని సర్వనాశనం చేసేందుకు పక్కా ప్రాణాళిక రూపొందించారు. అభివృద్ధి పేరిట వినాశనం మొదలుపెట్టారు. అడవిలోకి నరమానవులెవరూ ప్రవేశించకుండా కంచెల నిర్మాణమూ ప్రారంభించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవిని హైదరాబాద్ మహానగరానికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు అందించే నేచురల్ ఆక్సిజన్ సిలిండర్గా చెప్పుకుం టాం. అటువంటి అడవిని ధ్వంసం చేసేం దుకు ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. అక్కడ నేవీ అధికారులు, సిబ్బంది ఉండేందుకు టౌన్ షిప్ కట్టబోతున్నారు. పచ్చని అడవి స్థానంలో 2027 నాటికి స్కూళ్లు, హాస్పిటల్స్, మార్కెట్, బ్యాంకు, పెద్ద రోడ్లు పూర్తవ్వాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. అయితే ఇక్కడ నరికేయబోయే చెట్లకు బదులుగా దేశంలో ఏదో ఒక చోట ఇంకో 12 లక్షల చెట్లు నాటుతామని నేవీ అధికారులు పబ్లిక్ నోటీసు ఇచ్చారు. ఎన్ని చెట్లు నాటినా ఇంత పెద్ద సహజ మైన, ఔషధ మొక్కల అడవిని తిరిగి నిర్మించగలరా అనేది ఓ శేష ప్రశ్న. ఇప్పటికే అడవుల నరికివేతకు అధికారికంగా పర్మిషన్ ఇచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో ఉంది. 2014 అంటే, రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదేండ్లలో తెలంగాణలో అధికారికంగా 12,12,753 చెట్ల నరికివేతకు అనుమతి ఇచ్చినట్లు 2020లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, తెలంగాణ (పీసీసీఎఫ్) స్వయంగా హైకోర్టుకు చెప్పింది. ఇప్పుడు ఒకే అడవిలో 12 లక్షల చెట్లతో పాటు, 150 ఎకరాల్లో లక్షలాదిగా ఉన్న ఔషధ మొక్కల్ని సైతం సర్వనాశనం చేయబోతున్నారు. భవిష్యత్లో రాడర్ నుండి వెలువడే రేడియేషన్లతో పక్షులు, వన్యప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదమూ ఉంది. అన్నింటికీమించి ఈ రాడార్ కేంద్రం మూసీ నదికి మరణశాసనం కాబోతోంది. దీనిపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీరి ఆందోళనలో నిజముంది. ఎందుకంటే మూసీ పుట్టింది ఈ వికారాబాద్ అడవుల్లోనే. నది పుట్టిన చోట ఇటువంటి ప్రాజెక్ట్ నిర్మిస్తే భవిష్యత్తులో మూసీ ఎండిపోయే ప్రమాదం ఉంది. ఒకపక్క మూసీ ప్రక్షాళన చేస్తామంటున్నారు. మరోపక్క సహజ సందపను నాశనం చేస్తూ మూసీని కనుమరుగు చేయబోతున్నారు. ఇలాంటి వినాశనకర చర్యల వల్ల హైదరాబాద్ పకృతి వైపరీత్యాల నుంచి ఎలా తప్పించుకోగలదు? వాస్తవానికి రివర్ కేచ్ మెంట్ ఏరియాలో ఇలాంటి డెవలప్మెంట్ ప్రాజెక్టులు చేపట్టడం హైడ్రా చట్టానికి కూడా విరుద్ధం. అలాంటిది ఇంతటి విధ్వంసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం అత్యంత విషాదం. అలాగే తెలంగాణలో ఉన్న అతిపెద్ద నేచురల్ ఫారెస్ట్ ఈ దామగుండం అడవులు. నల్లమలలో కూడా ఐదు శాతం మాత్రమే న్యాచురల్ ఫారెస్ట్ ఉంది. హైదరాబాద్కు 80 కిలోమీటర్ల దూరంలో ఇంత అద్భుతమైన నేచురల్ ఫారెస్ట్ ఉండటం రాజధాని నగరానికి అతిపెద్ద సంపద. అంతే కాదు ఈ అడవి చుట్టూ ఉన్న 20 గ్రామాల్లో ఉన్న 60 వేల మందికి ఈ అడవే అమ్మతల్లి. రైతులు తమ పశువులు మేపుకోవడానికి ఈ అడవే ఆధారం. పచ్చటి పొలాలన్నీ రియల్ ఎస్టేట్లా మారిపోతున్న నేటి పరిస్థితుల్లో ఈ అడవే వాళ్లకు నెలవు. అటువంటి అడవిని నరికి వారి పొట్టకొట్టబోతున్నారు. రాడార్ కేంద్రం కోసం ఈపాటికే అడవి చుట్టూ భారీ ప్రహరీ కట్టడం మొదలుపెట్టారు. దీంతో స్థానికులెవరినీ ఇక అడవిలోకి పోనివ్వరు. అలాగే ఇదే అడవిలో 500 ఏండ్ల చరిత్ర ఉన్న పురాతన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు ఏడాది మొత్తం నీటి ఊటలూరే సహజమైన గుండం కూడా ఉంది. ఇవన్నీ అడవితో పాటే కనుమరుగుకానున్నాయనే భావనే గుండెలను పిండేస్తున్నది. ఇప్పటికే పెరిగిపోతున్న కాలుష్యం వల్ల నగర ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇక జనావాసానికి సమీపంలో రాడార్ కేంద్రం నిర్మిస్తే అనతి కాలంలోనే స్థానిక జనజీవనం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. ఇది వదిలే రేడియేషన్స్ వల్ల హైదరాబాద్లో మన తర్వాతి తరానికి స్వచ్ఛమైన గాలి అందకుండా పోతుంది. ప్రకృతి విపత్తులకు హైదరాబాద్ కేంద్రంగా మారే అవకాశమూ ఉంది. ప్రజలపై మరిన్ని రోగాలు దాడి చేసే ప్రమాదమూ ఉంది. ఢిల్లీలోవలె మన హైదరాబాద్లో కూడా మాస్క్ లేకుండా బయటకి రాలేని స్థితి వచ్చినా ఆశ్చర్యపోవల్సింది లేదు. ఇంతటి విధ్వంసాన్ని సృష్టించబోయే ఈ అభివృద్ధి అవసరమా? జరగబోయే ఈ వినాశనానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాడార్ కేంద్ర నిర్మాణంపై పునరాలోచించాలి. పర్యావరణానికి, ప్రజలకు హానిలేని ప్రదేశాన్ని దీని కోసం కేటాయించాలి. లేదంటే ఈ మహా విధ్వంసాన్ని ఆపేందుకు ప్రజలు మరో చిప్కో ఉద్యమానికి సన్నద్ధమవ్వడం ఖాయం.

# బుస కొడుతున్న కులవివక్ష!




'కసిరి బుసకొట్టు నాతని గాలిసోక.. నాల్గు పడగల హైందవ నాగరాజు' అంటూ సమాజంలో ఉన్న కుల దురహంకారాన్ని అనేక దశాబ్దాల క్రితమే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ఈసడించాడు. నాటి బుసలు.. నేడు కాలకూట విషంగా మారి. ప్రాణాలు తీసే స్థాయికి పెచ్చుమీరడం సిగ్గుచేటు. మన రాష్ట్రంలో ఇలాంటి దాడులు తరచూ చోటుచేసుకుంటుండగా, బిజెపి పాలిత రాష్ట్రాలు దేశంలోనే దళితులపై దాష్టీకాల్లో ముందువరసలో ఉన్నాయి. సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో ఓ ఇంటి అరుగుపై ఓ దళిత వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. మనిషిని మనిషిగా చూడలేని పెత్తందారీ కులానికి చెందిన ఆ ఇంటి యజమాని బాధితుడిని కర్రతో కొట్టడంతోపాటు మరిగే నూనె పోసేశాడు. మనం ఏ సమాజంలో ఉన్నాం అంటూ భయపడేలా చోటుచేసుకుంటున్న ఇలాంటి మరిన్ని ఘటనలూ మన రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. దళిత యువకుడు, బిసి యువతి ప్రేమించుకుని ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఇటీవల ఆ యువకుడి తల్లి తన స్వగ్రామానికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెత్తందారులు యువతి కుటుంబ సభ్యులను రెచ్చగొట్టారు. యువకుడి తల్లిపై దాడి చేయకపోతే గ్రామ బహిష్కారం చేస్తామని హెచ్చరించారు. పెత్తందారులు, యువతి కుటుంబ సభ్యులు కలిసి యువకుడి తల్లిని చెట్టుకు కట్టేసి పాశవికంగా కొట్టారు. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం కల్లుకూటలో ఈ అఘాయిత్యం జరిగింది. అగ్రవర్ణ బాలికను ప్రేమించాడని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో దళిత బాలుడిని స్తంభానికి కట్టేసి కొట్టారు. ఇక అదే జిల్లాలో జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ రంగరాయ కళాశాలకు చెందిన దళిత ప్రొఫెసర్‌పై దాడి చేశారు. బీహార్‌లోని నవాడా జిల్లాలో దళితులు నివాసముంటున్న 21 ఇళ్లకు ఇటీవల నిప్పు పెట్టారు. ఉత్తర ప్రదేశ్‌లో ఇలాంటి నేరాలకు అంతేలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్కు అభివృద్ధి పేరిట రాంపూర్ జిల్లా సిలారు బరగామ్‌లో లాఠీఛార్జి, కాల్పులు జరిపి పదో తరగతి చదువుతున్న దళిత విద్యార్థిని పొట్టనపెట్టుకుంది. కేంద్ర, సామాజిక న్యాయం, సాధికార శాఖ 2022కు సంబంధించి ఇటీవల విడుదల చేసిన నివేదిక మరిన్ని వాస్తవాలను కళ్లకు కట్టింది. ఆ ఏడాది దళితులపై దాష్టీకాలకు సంబంధించి 51,656 కేసులు దేశవ్యాప్తంగా నమోదయ్యాయి. బిజెపి పాలనలోని ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 12,287 కేసులతో.. 23.78 శాతం నేరాలతో యోగి పాలనలోని ఉత్తరప్రదేశ్ మొదటి స్థానాన్ని వెలగబెట్టింది. 8,661 కేసులు, 16.75 శాతం నేరాలతో రాజస్థాన్, 7,732 కేసులతో 14.97 శాతం నేరాలతో మధ్యప్రదేశ్ ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత స్థానాల్లో బీహార్, ఒడిశా, మహారాష్ట్ర ఉన్నాయి. ఈ ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం కేసులు నమోదయ్యాయి. ఇక మన రాష్ట్రం 2,190 కేసులతో ఏడో స్థానంలో ఉంది. ఎస్‌టిలపై వేధింపుల కేసులు దేశవ్యాప్తంగా 8,330 నమోదు కాగా, 379 కేసులతో రాష్ట్రం ఎనిమిదో స్థానంలో ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 15 మండలాలు, విజయనగరం జిల్లాలో 15 గ్రామాలు సహా రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అత్యధికంగా ఎస్‌సి, ఎస్‌టిలపై వేధింపులు జరుగుతున్నాయి. ఈ కేసులలో నిందితులు దర్జాగా తిరుగుతుండగా, బాధితులు బిక్కుబిక్కుమంటున్నారు. మొత్తంగా దళితులకు సంబంధించి 97.7 శాతం కేసులు 13 రాష్ట్రాల్లోనూ, అవే రాష్ట్రాల్లో ఎస్‌టిలపై 98.91 కేసులు నమోదయ్యాయి. ఈ విషయాలపై పెదవివిప్పని బిజెపి అగ్రనేత అమిత్‌షా గురివిందగింజ తన నలుపెరగదన్నట్టు ఇతర పార్టీల దళిత వ్యతిరేకత గురించి మాట్లాడుతున్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై నిత్యం విషం చిమ్ముతూ సమాజంలో చీలికలు సృష్టించి లబ్ధి పొందాలని కాచుక్కూర్చున్న సంఘపరివార్, బిజెపి శక్తులకు గట్టిగా బుద్ధి చెప్పాలి. 'అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నీ మెలగవలెనోయి మతం వేరైతేను యేమోయి.. మనసు వొకటై మనుషులుంటే..' అన్న గురజాడ స్ఫూర్తితో ముందడుగు వేయడమే మన కర్తవ్యం.

# మోడీ దిగ్విజయ యాత్ర



మానవాళి విజయం యుద్ధక్షేత్రంలో కాదు.. సమష్టి శక్తిలోనే ఉందని ఐక్యరాజ్యసమితి వేదికపై నుంచి ప్రకటించడం ద్వారా ప్రపంచ శాంతికి భారత్ కట్టుబడి ఉన్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి విస్పష్టంగా చెప్పారు. పలు దేశాలు యుద్ధాలతో, సంక్షోభాలతో, కలహాలతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ప్రధాని తన అమెరికా పర్యటనలో దాదాపు ప్రతి వేదికపైనా శాంతి సుస్థిరతలతోనే ప్రపంచం ముందుకు వెళ్తుందన్న విషయాన్ని పదేపదే నొక్కి చెప్పారు. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ సభ్యత్వ దేశాలుగా గల క్వాడ్ సదస్సులో పాల్గొనేందుకు అగ్రరాజ్యానికి బయల్దేరి వెళ్లిన ప్రధాని మోడీకి ఎప్పటిలాగే అపూర్వ స్వాగతం లభించింది. తన మూడు రోజుల పర్యటనలో అంతర్జాతీయ వేదికలపై ప్రసంగించడంతో పాటు వివిధ దేశాధినేతలతో టెక్నాలజీ, ఆర్థికాభివృద్ధి, ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని ముఖాముఖీ ఫలవంతమైన చర్చలు జరిపారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న భారత్‌కు మద్దతు ఇస్తామని అగ్రరాజ్యం హామీ ఇవ్వగా, వివిధ టెక్ దిగ్గజాలతో మోడీ జరిపిన భేటీలో పలువురు సిఇఒలు ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం హర్షించదగిన మరొక పరిణామం. బైడెన్ తో మోడీ జరిపిన ద్వైపాక్షిక చర్చల్లో కోల్‌కతాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్ నెలకొల్పేందుకు అంగీకారం కుదరడం గమనార్హం. ఇరుదేశాల మధ్య పరస్పర సాంకేతిక సహాయ సహకారాల వినిమయంలో భాగంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు అగ్రరాజ్యం అంగీకరించింది. సైనిక దళాలు వినియోగించే సాంకేతిక పరికరాలలో వాడే చిప్స్ తయారీలో ఈ సెమీకండక్టర్ ప్రాజెక్టు కీలకమవుతుంది. మోడీ పర్యటనలో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే- ఎప్పుడో అక్రమ మార్గాల ద్వారా తరలిపోయిన 297 ప్రాచీన కళాఖండాలను తిరిగి భారత్‌కు అగ్రరాజ్యం అప్పగించడం. ఢిల్లీలో గత జులైలో జరిగిన ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో సాంస్కృతిక కళాఖండాలను తిరిగి రప్పించడంపై అమెరికా -భారత్ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ అప్పగింత జరిగింది. విల్మింగ్టన్‌లో జరిగిన క్వాడ్ సదస్సులో సైతం మోడీ ఉద్రిక్తతలు, సంఘర్షణలు ప్రపంచాన్ని చుట్టుముడుతున్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. తనకు, పొరుగు దేశాలకు మధ్య విభేదాలు సృష్టించేందుకు 'విభజించు- పాలించు' అనే వ్యూహాన్ని క్వాడ్ సదస్సు అమలు చేస్తోందంటూ చైనా ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో క్వాడ్ సదస్సు ఎవరికీ వ్యతిరేకం కాదని ప్రధాని తేల్చిచెప్పారు. వాస్తవానికి క్వాడ్ సదస్సు ఈసారి ఇండియాలోనే జరగవలసి ఉండగా బైడెన్ అభ్యర్థన మేరకు వేదిక విల్మింగ్టన్‌కు మారింది. తన పర్యటనలో మూడోరోజు



ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన మోడీ, మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచ నేతల చర్యలు ఉండాలని ఆకాంక్షించారు. 'ఒక భూగోళం- ఒక కుటుంబం- ఒక భవిష్యత్తు' అనే నినాదానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. యుద్ధ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ఉక్రెయిన్, పాలస్తీనా అధ్యక్షులతో సైతం ప్రధాని భేటీ కావడం విశేషం. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో మోడీ భేటీ కావడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కాగా, ఈ ఏడాదిలో మూడోసారి. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ కట్టుబడి ఉందని మరోసారి పునరుద్ఘాటించిన మోడీ, రష్యా- ఉక్రెయిన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని నిలువరించే దిశగా శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో భారత్ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తన పర్యటనలో వివిధ దేశాధినేతలతో భేటీ అయిన ప్రధాని.. అమెరికా ఎన్నికలలో పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవకపోవడానికి కారణం ఆ దేశ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడమే కారణం కావచ్చు. కేంద్రంలో మూడోసారి అధికార పగ్గాలు చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం స్వతంత్ర విదేశాంగ విధానానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందనడానికి మోడీ ఇటీవలి కాలంలో రష్యా, ఉక్రెయిన్, అమెరికాలలో జరిపిన పర్యటనలు, సాధించిన విజయాలే ఉదాహరణలు. వివిధ దేశాలతో సంబంధ బాంధవ్యాలను పటిష్టపరచుకోవడంలో ప్రధాని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ 'భారత దేశ చరిత్రలో అమెరికాకు బాగా దగ్గరైన ప్రధాని మోడీ, అమెరికా చరిత్రలో భారత్ కు బాగా దగ్గరైన అధ్యక్షుడు బైడెన్' అంటూ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు!